ప్రజాశక్తి

ఆదివారం 12 మార్చి 2023 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, చిత్రంలో దోనేపూడి కాశీనాథ్, బోయి సత్యబాబు

నీటి మీటర్లపై ఏ సవాల్‌కైనా సిద్ధం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు
- 15లోపు ఎంఎల్‌ఎ విష్ణు, వైసిపి నేతలు స్పందించాలని డిమాండ్

ప్రజాశక్తి - విజయవాడ : మంచినీటితో వ్యాపారం తగదని, నీటి మీటర్లతో ప్రజలపై భారం మోపాలని చూడడం దారుణమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అన్నారు. నగరంలోని శ్రీశ్రీభవన్లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాబూరావు, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, విఎంసిలో సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు పాల్గొన్నారు. ఈ సమావేశంలో బాబూరావు మాట్లాడుతూ విజయవాడ నగరంలో నీటి మీటర్లు పెట్టలేదని స్వయానా అధికార వైసిపి సెంట్రల్ ఎంఎల్‌ఎ మల్లాది విష్ణు బుకాయిస్తున్నారని, నగరంలో నీటి మీటర్లు పెట్టినట్లు నిరూపించలేకపోతే సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు రాజీనామా చేయాలని కౌన్సిల్ బడ్జెట్ సమావేశంలో సవాల్ విసిరారని అన్నారు. నీటి మీటర్లపై ఏ రకమైన సవాల్‌నైనా ఎదుర్కోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. నీటి మీటర్ల ప్రత్యక్ష పరిశీలనకు సిపిఎం సిద్ధంగా ఉందన్నారు. కేంద్రం ఆదేశాలతో అమత్ పథకం కింద మధురానగర్ పసుపు తోటలో 900 గృహాలకు నీటి మీటర్లు బిగించారని, మరో 25 వేల మీటర్లను నగరవ్యాప్తంగా బిగించే ప్రక్రియను కాంట్రాక్ట్‌కు అప్పగించారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని, 24 గంటల నీటి పథకంతో నీటి వ్యాపారాన్ని, ప్రభుత్వ బండారాన్ని రుజువు చేస్తామన్నారు. గత రెండు (మిగతా 6లో)

వైఎస్ఆర్ శంకుస్థాపన చేసిన ప్రాంతంలోనే బందరు పోర్టు నిర్మాణం

- నోటిఫైడ్ భూముల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు
- మెటీరియల్ రవాణాకు అనుగుణంగా రోడ్డు నిర్మాణం
- త్వరలో సిఎం జగన్ చేతుల మీదుగా పనులు ప్రారంభం

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2008లో శంకుస్థాపన చేసిన ప్రాంతంలోనే తిరిగి బందరు పోర్టు నిర్మాణ పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. శంకుస్థాపనకు ఏర్పాటు చేసిన శిలాఫలకం సమీప భూముల్లోనే మచిలీపట్నం పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంపిడిసిఎల్) పోర్టు నిర్మాణానికి సన్నాహాలు చేస్తోంది. తాజాగా ఆ భూముల్లోకి అనుమతి లేకుండా ఎవరూ ప్రవేశించరాదని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసింది. పోర్టు నిర్మాణ ప్రాంతానికి మెటీరియల్ తరలించేందుకు వీలుగా రోడ్డు నిర్మాణ పనులను మెగా ఇంజనీరింగ్ సంస్థ ప్రారంభించింది. మార్చి చివరివారంలో లేదా ఏప్రిల్ ఒకటి రెండో వారాల్లోగానీ పనులు ప్రారంభిస్తారని అధికారులు చెబుతున్నారు.

పోర్టు నిర్మాణానికి సంబంధించిన మంగినపూడి, తవిశపూడి, గోపువానిపాలెం, కరగ్రహారం గ్రామాల్లోని 1688.84 ఎకరాల సముద్రతీర భూములకు ఇటీవల రెవెన్యూ యంత్రాంగం హద్దులను గుర్తించింది. సర్వే నంబర్లను కేటాయించింది. ఈ భూముల్లోనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ భూముల వద్ద నుంచి బీచ్ రోడ్డు వరకు 2.5 కిలో మీటర్ల నిడివి, 15 మీటర్ల వెడల్పుతో కాంట్రాక్టు సంస్థ రోడ్డు నిర్మిస్తోంది. పోర్టు నిర్మాణ పనులు ప్రారంభమైతే మెటీరియల్ తరలింపునకు వీలుగా దీని నిర్మాణం చేపట్టారు. నిర్మాణ ప్రాంతంలో ఇప్పటికే భూముల నాణ్యత పరీక్షలను, సర్వే పనులను కాంట్రాక్టు సంస్థ ప్రారంభించింది. రిగ్‌లతో భూములను డ్రిల్లింగ్ చేస్తోంది.

శిలాఫలకం...పైలాను...

బందరు పోర్టు నిర్మాణానికి మొదటిసారిగా 2008లో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చినకరగ్రహారం పల్లెపాలెం సముద్రతీర భూముల్లో శిలాఫలకం ఏర్పాటు చేశారు. ఆతర్వాత సార్వత్రిక ఎన్నికలకు కొద్దినెలల ముందు 2014 ఫిబ్రవరి 7న టిడిపి ప్రభుత్వ హయాంలో పోర్టు నిర్మాణానికి సూచకగా మేకావానిపాలెంలో పైలాన్‌ను మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. మంగినపూడి సముద్రతీర భూముల్లో యంత్రాలతో పనులు ప్రారంభించారు. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం కాంట్రాక్టు సంస్థ నవయుగతో నిర్మాణ ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. ఆ తర్వాత మెగా ఇంజనీరింగ్ సంస్థ పోర్టు నిర్మాణ టెండరును దక్కించుకుంది. ఈనెలాఖరులోగానీ, ఏప్రిల్ మొదటి రెండు వారాల్లోగానీ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరెడ్డి శంకుస్థాపన చేసిన ప్రాంతంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పోర్టు నిర్మాణ పనులు ప్రారంభిస్తారని అధికారులు చెబుతున్నారు. దీనికి అవసరమైన ఏర్పాట్లను కూడా చేస్తున్నారు.

పోర్టుకు వెళ్లే రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం; వైఎస్ఆర్ శంకుస్థాపన చేసిన శిలాఫలకం (కింద), హెచ్చరిక బోర్డు (పైన)

తెల్లబంగారం ధర దిగువకు

- బహిరంగ మార్కెట్లో క్వింటా పత్తి రూ.7 వేలలోపే
- గతేడాది రూ.10 వేలకుపైగా ధర
- ఒకపక్క తగ్గిన దిగుబడులు
- మరోపక్క ధర లేక రైతులు అప్పులపాలు

ప్రజాశక్తి - కంచికచర్ల : ఈ ఏడాది పత్తి పంట ధరలు రోజురోజుకూ దిగజారిపోతున్నాయి. ఆరుగాలం కష్టించి పత్తి సాగుచేస్తే...నకిలీ, నాసిరకం విత్తనాలకుతోడు చీడపీడలు ఆశించడంతో దిగుబడులు తగ్గాయి. పంట సాగుకు ఎకరాకు సగటున రూ.45 వేల నుండి రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టారు. అయితే ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా, 5 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. దీనికితోడు ధరలు కూడా లేకపోవటంతో పత్తి రైతులు పీకల్లోతు అప్పుల్లో కూరుకు పోయారు. పత్తి విరుపులు ప్రారంభమైన తొలి రోజుల్లో క్వింటా పత్తికి రూ.7 వేల ధర పలికింది. అప్పట్లో ఆ ధర చాలా తక్కువే. అయినా కొందరు రైతులు తమ అవసరాలను ఆధారంగా అమ్ముకున్నారు. ఈఏడాది జనవరి నుండి రూ.10 వేలు దాటుతుందని ఆశ పడి వచ్చిన కొద్దిపాటి దిగుబడిని కూడా తమ ఇళ్లల్లో నిల్వ చేసుకున్నారు. కానీ ప్రైవేటు వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధరలు పెరగకుండా చేశారు. అప్పటినుండి రోజురోజుకూ ధరలు పతనమయ్యాయి. పత్తి పంట తొలి విరుపుల సమయంలో వ్యాపారులు రైతుల వద్ద తక్కువకు కొని నిల్వ చేశారు. ఆ తర్వాత కొద్దిగా ధరలు పెరగటంతో అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. ఆ తర్వాత పత్తి పంటకు ఎగుమతుల్లేవని, మిల్లర్లు కొనుగోలు చేయడంలేదని ప్రైవేట్ వ్యాపారులు కుంటిసాకులు చెప్పికొన్ని రైతుల వద్ద కొనటానికి కళ్లల్లోకి కన్నెత్తి చూడలేదు. ధరలు పెరగకుండా వ్యాపారులు కట్టడి చేశారు. ఈ ఏడాది జనవరి చివరివారంలో క్వింటా పత్తి రూ.7500 ధర పలికింది. దీంతో రైతులు ధరలు పెరుగుతాయని ఆశతో ఇళ్లల్లోనే నిల్వ చేసుకున్నారు. అయితే ఫిబ్రవరి మొదటి వారం నుంచి ధరలు రోజురోజుకూ తగ్గిపోయాయి. ప్రస్తుతం గ్రామాల్లో క్వింటా పత్తి రూ.6500 నుండి రూ.7 వేలకు మించి అడగటం లేదు. ధరలు పెరుగుతాయని నెలల తరబడి పత్తిని ఇళ్లల్లో నిల్వ చేస్తే, తీరా రోజురోజుకు ధరలు పతనం కావటంలో రైతులు లబోదిబోమంటున్నారు. ఉగాది తర్వాతనైనా ధరలు కొద్దిగా పుంజుకుంటాయని ఆశతో ఎదురు చూస్తున్నారు. ధరలు దిగజారిపోతుంటే ప్రభుత్వం మిన్నకుండటం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రభుత్వ హయాంలో రైతులకు మేలు జరిగిందని అధికార పార్టీ నాయకులు ఊకదంపుడు ఉపన్యాసాలు చేయడం తప్ప ఆచరణలో తమకు మేలు జరగడంలేదని పత్తి రైతులు వాపోతున్నారు. గతంలో ప్రభుత్వం మార్కెట్ యార్డుల్లో సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు చెసేది. బహిరంగ మార్కెట్లో పత్తి ధరలు తగ్గినప్పుడు, ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా చూసేది. అయితే కొన్నేళ్లుగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలేదు. దీంతో ప్రైవేట్ వ్యాపారులు ధరలు పెరగకుండా కట్టడి చేస్తున్నారని కౌలు రైతు సంఘం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఇంట్లో నిల్వ ఉంచిన పత్తి

విజయవాడ ఎంజి రోడ్డులోని మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయం

మార్గదర్శి కార్యాలయాల్లో సిఐడి సోదాలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఖాతాదారుల సొమ్ము ఇతరత్రా వాటికి మళ్లించినట్లు ఆరోపణలు రావడంతో విజయవాడలోని మార్గదర్శి చిట్ ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయాల్లో శనివారం సిఐడి అధికారులు తనిఖీలు నిర్వహించారు. నగరంలోని మ్యూజియం రోడ్డు మార్గదర్శి ప్రధాన కార్యాలయంతోపాటు ఎంజి రోడ్డులోని మార్గదర్శి బ్రాంచ్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. ప్రధాన కార్యాలయంలోని ఫోర్‌మెన్ శ్రీనివాస్‌ను సిఐడి అధికారులు అదుపులోకి తీసుకుని పూర్తి సమాచారం సేకరిస్తున్నారు. దీంతోపాటు ఆయన ఇంట్లోనూ సోదాలు చేస్తున్నట్లు సమాచారం. రాత్రి సమయంలో ఎంజి రోడ్డులోని బ్రాంచ్ కార్యాలయానికి వచ్చిన సిఐడి అధికారులు 10 గంటల వరకూ తనిఖీలు నిర్వహిస్తూనే ఉన్నారు. తనిఖీల ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. విజయవాడ చిట్స్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఫిర్యాదు మేరకు గతంలోనే మార్గదర్శి చిట్స్ కార్యాలయాలపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈనేపథ్యంలో గతంలో కేవలం సంస్థ కార్యాలయంపైనే దాడులు చేసి సంబంధిత రికార్డులను పరిశీలించిన సిఐడి అధికారులు ఈసారి నిధుల మళ్లింపు ఏవిధంగా జరిగింది, ఎక్కడెక్కడకు బదిలీ చేశారనే సమాచారం రాబట్టం కోసం ప్రయత్నించినట్లు తెలిసింది. చిట్‌ఫండ్ చట్టాన్ని ఉల్లంఘించి నిధులను మళ్లించారనే ఆరోపణపై ఈదాడులు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

గంజాయి కేసులో నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - భవానీపురం : భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో 6 కేజీల గంజాయితో పట్టుబడ్డ ఓ మహిళతో పాటు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని శనివారం వారిపై పోలీసులు కేసు నమోదుచేసి అరెస్టు చేశారు. ఈ విషయమై శనివారం భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో వెస్ట్ ఏసిపి కె. హనుమంతరావు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసిపి హనుమంతరావు మాట్లాడుతూ భవానీపురం ఇన్‌స్పెక్టర్ ఎం.డి. ఉమర్ మరియు సిబ్బందికి వచ్చిన సమాచారం మేరకు శనివారం ఉదయం 7.30 గంటలకు భవానీపురం స్టేషన్ పరిధిలోని గొల్లపూడి గ్రామ పంచాయతి అట్కిన్‌సన్ స్కూల్ రోడ్ నుండి ఊర్మిళానగర్ వెళ్ళే రోడ్‌లో గల ఖాళీ స్థలం వద్ద నలుగురు వ్యక్తుల గంజాయి అమ్ముతున్నారన్న సమాచారం మేరకు వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి ఆరు కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, విచారించారు. తాడేపల్లికి చెందిన వల్లూరి నాగమణి ఎక్కువ మొత్తంలో డబ్బులు సంపాదించాలని గంజాయి వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కలకత్తా నుంచి గొల్లపూడిలో మగ్గం పనులు చేసుకుంటున్న షేక్ అమినూర్, లష్కర్ కరీబుల్లా, అబ్బాసుద్దిన్ మెండల్‌లుకు అమ్మింది. ఆ వ్యక్తులు ముగ్గురు వారు చేసే పనికి వచ్చే డబ్బులు సరిపోక సులభ మార్గంలో డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో గంజాయి అమ్మే తాడేపల్లికి చెందిన వల్లూరి నాగమణి వద్ద గంజాయి కొనుగోలు చేసి, వాటిని చిన్న చిన్న పొట్లాలుగా చేసి వీరు ముగ్గురు వేరే వారికి ఎక్కువ రేటుకు అమ్ముతున్నారని విచారణలో తెలిందని ఏసిపి తెలిపారు. దీంతో మహిళతో పాటు ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. ఈ సమావేశంలో భవానీపురం సిఐ ఎం.డి. ఉమర్, ఎస్ఐలు లాలం ప్రసాద్, రవీంద్రబాబు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్టు

● 10 వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-విజయవాడ : ద్విచక్రవాహనాలను దొంగిలిస్తున్న దొంగను కృష్ణలంక పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఇబ్రహీంపట్నం మండలం జూపూడికి చెందిన కుంచనపల్లి గంగాధరరావు (ప్రస్తుతం అమలాపురంలో నివాసం)ను స్థానిక పిఎన్ బస్‌స్టాండ్ వద్ద శనివారం అదుపులోకి అతని వద్ద నుంచి రూ. ఐదు లక్షల విలువ చేసే 10 ద్విచక్రవాహనాలను (చోరీ సొత్తు) స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశారు. ఈ మేరకు పోలీస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సౌత్ జోన్ఎసిపి రవికిరణ్ మాట్లాడుతూ...విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టాండ్ వద్ద ఎక్కువుగా ద్విచక్రవాహనాలు పోతున్నాయని ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. ఆ ప్రాంతాల్లో నిఘా పెంచి బైక్ దొంగతనాలు చేస్తున్న కుంచనపల్లి గంగాధరరావుఅనే నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 10 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. నిందితుడు కరోనాకు ముందు తన అత్తగారి ఊరు అయిన అమలాపురం వెళ్లి అక్కడే ఉంటున్నాడన్నారు.. జల్సాలకు అలవాటు పడిన గంగాధరరావు తన సంపాదనతో వచ్చే డబ్బులు చాలక సులువుగా డబ్బు సంపాదించాలని, ద్విచక్రవాహనాలను మారు తాళాలతో దొంగిలించి వాటిని అమ్ముకొని వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తుండేవాడన్నారు. అమలాపురంలో దొంగతనాలుచేసే దొరికిపోతానని భావించిన నిందితుడు, విజయవాడ వచ్చి బస్టాండ్ వద్ద తరుచూ బైక్‌లు దొంగతనాలు చేస్తూ...వాటిని రామవరప్పాడు రింగ్ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో దాచిపెట్టి అక్కడి నుంచి అమలాపురం తన ఇంటికి వెళ్లి పోతుండేవాడన్నారు. ఈ విధంగా ఈ ఏడాది జనవరి నుంచి బస్టాండ్ సమీపంలో వివిధ ప్రదేశాల్లో పార్కింగ్ చేసి ఉన్న 10 బైక్‌లను దొంగిలించాడన్నారు. శనివారం వాటిల్లో ఒక బైక్‌ను గుంటూరులో అమ్ముకొని వచ్చిన డబ్బుతో జల్సా చేద్దామని ఒక బైక్‌ను విజయవాడ మీదుగా గుంటూరు వెళు న్న సమయములో స్క్రూబ్రిడ్జి వద్ద పోలీసులు గంగాధరరావును అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయాలు వెలుగు చూశాయన్నారు. అతన్ని అరెస్ట్‌చేసి అతని వద్ద నుంచి 10 బైక్‌లు స్వాధీనం చేసుకొని, నిందితుడిని విజయవాడ జైల్‌కు పంపించినట్లు ఎసిపి తెలిపారు. ఈ సమావేశంలో స్టేషన్ సిఐ దుర్గారావు, క్రైమ్ ఎస్ఐ కృష్ణబాబు పాల్గొన్నారు.

మంచినీరు సరఫరా చేయాలని ధర్నా

ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి-నందిగామ : నందిగామను నవ నందిగామ చేస్తాం అనే ముందు వేసవిలో పేదలకు ఉతాగునీరు సౌకర్యం కల్పించాల్సిన భాద్యత ఉందని సిపిఎం పట్టణ కార్యదర్శి కటారపు గోపాల్ పాలకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో శనివారం నందిగామ డివిఆర్ కాలనీలో మహిళలు ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నందిగామ మండల కార్యదర్శి కటారపు గోపాల్, సిపిఎం నాయకులు సయ్యద్ ఖాసిం మాట్లాడుతూ పట్టణంలోని ఉన్న 20 వార్డుల్లో మంచినీటి సమస్య చాలా ప్రధానమైన సమస్యగా ఉందన్నారు. మరీ ముఖ్యంగా నందిగామ పట్టణం 17, 18,16,14 వ వార్డులలో గత పది రోజుల నుండి కూడా మంచినీరు రాక ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే ఎండలు ఎక్కువగా ఉన్న ప్రజలు మంచినీళ్ల ఎక్కువ అవసరం అవుతాయి కానీ మంచినీళ్ల తాగటానికి కూడా దొరకని పరిస్థితి నెలకొందన్నారు ఉందన్నారు. 90 కోట్లతో మంచినీటి సరఫరా పథకం ఎక్కడ వరకు వచ్చిందన్నారు.. అసలు ఇస్తారా లేదా..గత మూడు సంవత్సరాల నుండి చెబుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మంచినీళ్లు దొరక్కే నందిగామ 18 వ వార్డులో ప్రజలు రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ట్యాంకర్ల ద్వారా ప్రజలకి మంచినీరు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సయ్యద్ ఖాసిం, సిపిఎం నందిగామ కమిటీ సభ్యులు బత్తుల,వెంకటేశ్వర్లు ఉప్పు, శ్రీను కోటేశ్వరావు, నాగరాజు ,రోశయ్య, చంద్ర, సైదులు మహిళలు పాల్గొన్నారు.

బ్యాంకులకు ధీటుగా సహకార సంఘాలు బలోపేతం



ప్రజాశక్తి - తిరువూరు : వాణిజ్య బ్యాంకులకు ధీటుగా సహకార సంఘాలను బలోపేతం చేస్తున్నట్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. తిరువూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(సొసైటీ)లో నూతనంగా ఏర్పాటుచేసిన లాకర్లు, క్యాష్ కౌంటర్లను నాగేశ్వరరావు ఎమ్మెల్యే రక్షణనిధి తో కలిసి శనివారం ప్రారంభించారు. అనంతరం సొసైటీ ఆవరణలో చైర్మన్ సీతారామయ్య అధ్యక్షతన జరిగిన సభలో నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ సహకార సంఘా ల ద్వారా రైతులకు, ప్రజలకు సేవలం దించాలనే లక్ష్యంతో సొసైటీలను వికేంద్రీకరణ చేస్తున్నారని, ఇప్పటికి రాష్ట్రంలో రెండువేల సొసైటీ లను లాకర్లగా, క్యాష్ కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా కేంద్ర బ్యాంక్ ఈ ఏడాది రూ. 10 వేల కోట్లు టర్నోవర్ చేసి నాబార్డు చేత అవార్డు పొందామ న్నారు. వాణిజ్య బ్యాంకుల వలే సొసై టీ లలో కూడా గోల్డ్ లోన్లు, పాస్ పుస్త కాలకు లోన్లు ఇస్తున్నామని వెల్లడించారు. నడిమి తిరువూరు సొసైటీకి అధ్యక్షులుగా పనిచేసి రాష్ట్ర స్థాయి పదవులు అనుభవించిన వ్యక్తులు సొసైటీని అభివద్ధి చేయలే దని, వైసిపి ప్రభుత్వంలో రూ.లక్షలతో లాకర్లు, క్యాష్ కౌంటర్లు ఏర్పాట్లుచేసి రైతులకు, ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని నాగేశ్వరరావుతో పాటు ఎమ్మెల్యే అన్నారు. ఈకార్యక్రమంలో ఎంఎసి చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, జడ్పిటిసి యరమల రామచంద్రారెడ్డి, నగర పంచాయతీ చైర్ పర్సన్ గత్తం కస్తురిబాయి, ఎంపిపి గుద్దల భారతి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన మాడుగుల

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుని రాష్ట్ర టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి మాడుగుల సురేష్ శనివారం కలిశారు. ఈ సందర్భంగా ట్రేడ్ యూనియన్‌కు సంబంధించి ఆయనతో కొన్ని విషయాలు చర్చించారు. ఇంకా అన్ని యూనియన్ కమిటీలు వేస్తూ వారిని చైతన్య పరుస్తూ పార్టీ బలోపేతానికి కషి చేయాలని సూచించినట్లు సురేష్ తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-నందిగామ : నందిగామ వరల కంపెనీ ఏసుక్రీస్తు ప్రార్ధన మందిరం ఫెలో జూనియ గాస్పల్ సొసైటీ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. బి.సత్యపాల్ పాస్టర్ గోసంగి జాన్ బాబు, పాస్టర్ మర్రి రాజారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితముగా ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు , నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఏజీపీ మట్టా ప్రసాద్, నందిగామ వాకర్స్ ప్రెసిడెంట్ శ్రీరామ్మూర్తి , టెన్త్ క్లాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గమ్మ దర్శనానికి వచ్చి వ్యక్తి అదృశ్యం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : దుర్గమ్మ దర్శనానికి వచ్చిన కడపకు చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటనపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లలో శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గోర్ల వెంకట లక్ష్మమ్మ, నాగరాజు కుటుంబం కడప జిల్లా యర్రగుంట్ల మండలం, పోట్లదుర్తి గ్రామం, కొత్తకోటాలు నందు నివాసం ఉంటున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. గోర్ల వెంకట లక్ష్మమ్మ కూలి పనులు చేసుకంటూ జీవనం సాగిస్తుంటుంది. ఈమె కుమారుడు జి. నాగేంద్ర (27) చిన్న వయస్సు నుంచి మతిస్థిమితం సరిగా ఉండదు. ఈ నేపథ్యంలో కుమారుడిని ప్రతి రెండు నెలలకు ఒకసారి చికిత్స నిమిత్తం విజయవాడలోని ఓ హాస్పిటల్‌కు తీసుకువస్తుంటారు. ఈ క్రమంలో ఈనెల 9వ తేదీ కడప నుంచి ఉండల్లిలో ఉంటున్న వెంకట లక్ష్మమ్మ కుమార్తె ఇంటికి వచ్చారు. అదే రోజు సాయంత్రం హాస్పిటల్ నందు చికిత్స చేయించుకుని, 10వ తేదీ ఉదయం 11 గంటలకు తల్లి వెంకట లక్ష్మమ్మ, కుమారుడు నాగేంద్ర, కుమార్తె కలిసి దుర్గమ్మ గుడికి వెళ్ళారు. టాయిలెట్‌కు వెళ్ళి వస్తానని కుమారుడు నాగేంద్ర వెళ్ళి మరలా కనిపించలేదు. దీంతో తల్లి గోర్ల వెంకట లక్ష్మమ్మ శనివారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్.ఐ. శంకరరావు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

చండీయాగం బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడలో శివశక్తి నగర్ సమీపంలో సివిఆర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి పక్కన ఉన్న శ్రీ దేవి కరుమారి అమ్మన్ శక్తిపీఠం ఆధ్వర్యంలో ఏప్రిల్ 27 నుండి మే 3 తేదీ వరకూ నిర్వహించనున్న సహస్ర చండీ యాగ పూర్వక మహా కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొనాలని పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ కరుమారి దాసు శనివారం విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేనికి ఆహ్వానం పలికారు. శనివారం కేశినేని భవన్ లో ఎంపీ నానిని మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించిన శ్రీశ్రీశ్రీ కరుమారి దాసుని ఈ సందర్భంగా ఎంపీశాలువా కప్పి గౌరవించారు. కరుమారి దాసు ఎంపీ నాని కి అమ్మవారి జ్ఞాపికను బహుకరించారు. అనంతరం నాని సహస్ర చండీ యాగానికి సంబంధించిన బ్రోచరుని ఆయన చేతులు మీదుగా ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్, తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి వాసం మునయ్య, ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు లింగమనేని శివరాం ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్ఐ, కానిస్టేబుల్‌కు అరెస్టు వారెంట్లు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టణంలో ఓ కేసుకు సంబంధించి 2017లో జగ్గయ్యపేట పట్టణ ఎస్సైగా పనిచేసిన పి. ప్రియకుమార్, కానిస్టేబుల్ ఎస్. చిరంజీవి, పి.హరిబాబుకు జగ్గయ్యపేట కోర్టు శుక్రవారం అరెస్టు వారింట్లు జారీ చేసింది. పట్టణానికి చెందిన నూకల సాంబను పోలీసులు అక్రమంగా బంధించి తీవ్రంగా కొట్టి గాయపరిచారని పేర్కొంటూ అతని భార్య 2017లో జగ్గయ్యపేట న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సమన్లు జారీ చేసినప్పటికీ కోర్టుకు హాజరుకానందున ఎస్సై, కానిస్టేబుల్ కు కోర్టు అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. ఈ కేసులో నిందితులైన అప్పటి సీఐ లచ్చి నాయుడు, కానిస్టేబుల్ నాగరాజు ఈ నెల 27వ తేదీన కోర్టుకు హాజరు కావాలని అడిషనల్ జూనియర్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ ఎం శోభారాణి ఉత్తర్వులు ఇచ్చారు.

సరిహద్దు రాళ్లు ఏర్పాటు

ప్రజాశక్తి-కంచికచర్ల : జగనన్న భూ రక్ష పథకం లో భాగంగా రీ సర్వే పూర్తి కావటంతో భూముల్లో హద్దు రాళ్ళు ఏర్పాటు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. కంచికచర్ల మండలం పరిటాల లో జగనన్న భూ రక్ష పథకం లో భాగంగా ప్రభుత్వం, ప్రైవేట్ భూముల్లో రీ సర్వే పూర్తయి, రైతులకు పట్టాలు కూడా అందజేశారు. దీంతో ప్రభుత్వమే ప్రభుత్వ భూములు, ప్రైవేట్ భూముల్లో హద్దు రాళ్ళు ఏర్పాటు చేస్తోంది. శనివారం రీ సర్వే డిప్యూటీ ఇన్స్పెక్టర్ రవీంద్ర, స్థానిక తహశీల్దార్ వి రాజకుమారి హద్దు రాళ్ళు ఏర్పాటు పనులు పరిశీలించారు. త్వరితగతిన హద్దు రాళ్ళు ఏర్పాటు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ శిరీష, సర్వేయర్ బసవరావు, వీఆర్వో లు శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చదువు, ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : పదవ తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో విద్యార్థుల చదువు, ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని కెవిఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ బత్తుల వెంకటనర్సు, ప్రధానోపాధ్యాయురాలు కె జలజ పేర్కొన్నారు.. శనివారం పాఠశాలలో ఉపాధ్యాయుడు ముక్కా సత్యనారాయణ అధ్యక్షతన విద్యార్థులు తల్లితండ్రులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పరిస్థితి, చదువు, హాజరు వంటి విషయాలు, పరీక్షలు జరిగే విధానం గురించి వివరించారు.. ఉపాధ్యాయులతో ఎప్పటికప్పుడు వారి పిల్లల ప్రగతి గురించి సమన్వయం చేసుకోవాలని తెలిపారు. పిల్లల తల్లిదండ్రులు కూడా వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సీనియర్ ఉపాధ్యాయులు పొడుగు శ్రీనివాసరావు, స్టాఫ్ సెక్రటరీ జి వి రామకష్ణ, ప్రభుదాస్, రాములు, సి ఆర్ పి జొన్నలగడ్డ గోపాల్, నాగేశ్వరరావు, పద్మ తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో దాదాపు డెబ్బై మంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఐటిసితో యాక్సిస్ బ్యాంకు భాగస్వామ్యం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అతిపెద్ద ప్రయివేట్ బ్యాంకులలో ఒకటైన యాక్సిస్ బ్యాంకు ఐటీసీ లిమిటెడ్‌తో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు బ్యాంకు ప్రతినిధి రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. దీని ద్వారా వ్యవసాయ అనుబంధ విభాగాలలో భాగమైన రైతులకు బ్యాంక్ రుణ ఉత్పత్తులను సేవలను అందించనున్నట్లు తెలిపారు. మారుమూల ప్రాంతాలలో కూడా అతి తక్కువ వడ్డీతో ఋణాలను అందించనున్నట్లు తెలియచేశారు. రైతు రుణాలు, బంగారు రుణాలు వంటి అనేక రకాలైన ఉత్పత్తులను బ్యాంక్ అందచేస్తుందన్నారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేద్దాం

మొవ్వలో

చల్లపల్లిలో

పెదపారుపూడిలో

ప్రజాశక్తి-యంత్రాంగం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ ఐదో తేదీన జరపతలపెట్టిన చలో ఢిల్లీ కార్మిక, కర్షక, పోరాట ప్రదర్శను జయప్రదం చేయాలని సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతుసంఘం, కౌలు రైతుసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆయా సంఘాల కృష్ణాజిల్లా కమిటీల ఆధ్వర్యంలో చలో ఢిల్లీ పిలుపును జయప్రదం చేయాలని కోరుతూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారంనాడు కరపత్రాల పంపిణీని నిర్వహించారు. పెదపారుపూడి : కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే మహాధర్నాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఓ. గంగాధర్ ప్రసాద్ కార్మికులను కోరారు. శనివారం మండల కేంద్రమైన పెదపారుపూడి గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఎనిమిది సంవత్సరాల కాలంలో కార్మికులు, రైతులు, ప్రజా సమస్యలను పట్టించుకోకుండా అధికారమే పరమావధిగా అన్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందన్నారు. సమావేశానికి వేము వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఉప్పలపాటి అనూష, గ్రామపంచాయతీ, ఆశా, మిడ్డే మీల్స్, ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు. **చల్లపల్లి :** చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా కార్మికులకు పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని కొత్త మాజీరులో రాష్ట్ర గిడ్డంగి సంస్థ హమాలీలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంఘటిత కార్మికులైన హమాలీలకు, రవాణా, ఆటోమొబైల్స్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ చట్టంపై రక్షణ కల్పించాలని కనీసం వేతనం అమలు చేయాలని కోరారు. పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థ నుండి 14 రకాల నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, హమాలీల ముఠా నాయకుడు ఏడుకొండలు, కార్మికులు పాల్గొన్నారు. **మొవ్వ :** కార్మిక – కర్షక పోరాట ప్రదర్శనను జయప్రదం చేయాలని ఏపి కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు కోరారు. ప్రదర్శన విజయవంతం చేసే క్రమంలో ప్రజా సంఘాలు రూపొందించిన కరపత్రాలను మొవ్వ మండలంలోని గ్రామాలలో ప్రజాసంఘాల ప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు కాకి రాజశేఖర్,సహాయ కార్యదర్శి సుబ్రమణ్యం, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాస్, రైతు సంఘం నాయకులు మద్దెల బసవారావు ,వ్యకాస మండల నాయకులు శాంసన్ ,కొనకళ్ళ రాంబాబు,కౌలు రైతు సంఘం మండల నాయకులు వెంకటేశ్వరరావు, బొల్లా సుబ్రమణ్యం తదితరులు ఉన్నారు.

చదువుతోపాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఫంక్షన్ హాల్‌లో శ్రీరాం అమ్మాణి విద్యా సంస్థ కళాశాల విద్యార్థుల వీడ్కోలు (ఫేర్వెల్) కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి శ్రీరాం రాజగోపాల్, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం

మాట్లాడుతున్న శ్రీరాం తాతయ్య

సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజగోపాల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మంచి ఉపాధ్యాయులతో ఉత్తమ సమాజం ఏర్పడుతుందని తాను భావిస్తున్నట్లు తెలిపారు. చదువుతోపాటు ప్రతి ఒక్కరూ జీవితంలో క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. అలాగే ఆరోగ్యం విషయంలో కూడా జాగ్రత్త పడాలని సూచించారు. విద్యార్థులు నిరంతరం సమాజాన్ని పరిశీలిస్తూ ఉండాలన్నారు.అనంతరం ఉత్తమ ఫలితాలతో ప్రతిభ చూపిన విద్యార్థులను యాజమాన్యంతో కలిసి జ్ఞాపికను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రంగాపురం నరసింహారావు, పెనుగొండ రాజేష్, జూటూరి వెంకటేశ్వర్లు (అబ్బులు మాస్టారు), పి. సుధీర్ కుమార్ మరియు అధ్యాపక బందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు బిజెపికి వ్యతిరేకంగా నిరసన

కాంగ్రెస్ కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ప్రభుత్వరంగ సంస్థలు అమ్మకం, ప్రవేటీకరణలను నిరసిస్తూ ఈ నెల 13న దేశవ్యాప్తంగా అన్ని రాజ్ భవన్‌ల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కొడమంచిలి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

పారిశ్రామిక వేత్త గౌతమ్ ఆదానీ, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మధ్యనున్న వ్యాపార సంబంధాలను వెంటనే బయట పెట్టి, దేశ ప్రజలకు తెలపాలని డిమాండ్‌చేశారు. అదానీ అక్రమ వ్యాపారాలు జాయింట్ పార్లమెంటరీ కమిటీచే (జీపీసి) విచారణ జరిపించాలని కోరారు. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జీవిత భీమా సంస్థలు, స్టేట్ బ్యాంకుల వద్ద నిరసన తెలుపుతున్నామన్నారు. ప్రధాని మోడీ దేశ సంపదను అదానీకి దోచిపెట్టి అక్రమ వ్యాపారాలకు కొమ్ముకాస్తూ దేశ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. మోడీకి పారిశ్రామిక వేత్తలపై ఉన్న ప్రేమ దేశ ప్రజలపై లేదన్నారు.

15 నుంచి క్రీస్తు సువార్త సభలు

ప్రజాశక్తి-గుడివాడ

గ్రేస్ ప్రార్థన మందిరం అధ్వర్యంలో ఈ నెల 15,16,17 తేదీల్లో సత్య సువార్త క్రీసు సభలు నిర్వహిస్తునట్లు పాస్టర్ డి.సామ్యూల్‌బ్రేనార్డ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బంటుమిల్లిరోడ్డులోని సత్యశ్రీధర్ కాళ్యాణ మండపం సమీపంలోని గ్రేస్‌ప్రార్థన మందిరం అవరణలో ఉదయం 10.30ని నుండి రాత్రి 6.30 గంటల వరకూ జరుగుతాయని వివరించారు.

12న ప్రతిష్టా మహోత్సవం

చల్లపల్లి : మండల పరిధి లక్ష్మీపురం పంచాయతీ రామానగరంలో నూతన కోదండ రామస్వామి దేవాలయం ప్రతిష్ట మహోత్సవానికి సిద్ధమైంది. సోమవారం ఉదయం శ్రీ సీతారాముల, లక్ష్మణ, హనుమంతుల నూతన విగ్రహాల ప్రతిష్ట చేయనున్నారు. ఈ సందర్భంగా 12న ప్రతిష్టామూర్తులకు జల, క్షీర, పుష్ప, ధాన్య అధివాస హోమాలు నిర్వహిస్తారు. 13న మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. మేడిశెట్టి వీర రాఘవయ్య – రాజ్యలక్ష్మి, కస్తూరి శ్రీనివాసరావు – లక్ష్మీ నాంచారమ్మ దంపతులచే ప్రతిష్ట మహోత్సవాలు నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు.



సభ్యత్వాలను స్వీకరిస్తున్న సురేష్‌బాబు తదితరులు

సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ప్రభుత్వ తీరు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

రాష్ట్రంలో ఉద్యోగులు,పెన్షనర్ల ప్రధాన సమస్యల పట్ల ప్రభుత్వం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా వ్యవహరించడం బాధాకరమని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిూస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మచిలీపట్నంలో మున్సిపల్ ఉద్యోగులతో అసోసియేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. సురేష్ బాబు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా పిఆర్సీలో మధ్యంతర భృతి కంటే తక్కువగా ఫిట్మెంట్ ఇవ్వడం, ఉద్యోగులు, పెన్షనర్లకు సమయానికి జీతాలను చెల్లించకపోవడం, ఉద్యోగులు తమ అవసరాల కోసం దాచుకున్న డబ్బును ప్రభుత్వం వాడుకోవడం లాంటి అంశాలు సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ పథకాలన్నిటినీ పకడ్బందీగా ప్రజలకు అందిస్తున్న ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి సరికాదని తెలిపారు. సిపిఎస్ రద్దు అంశంలో ప్రతిపక్షాలు తమ వైఖరి స్పష్టం చేయాలని,సీపీఎస్ రద్దు కోరుతూ ప్రభుత్వానికి లేఖలు రాయాలని కోరారు. ఇప్పటికైనా రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి మౌనం వీడి ముఖ్యమంత్రే స్వయంగా ఉద్యోగ సంఘ నేతలతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మేడేపల్లి సుబ్బారావు, కొల్లూరి వెంకటేశ్వరరావు, చీలి దుర్గాప్రసాద్, బి. శివ ప్రసాద్, బండారు శ్రీనివాసరావు, పి. ప్రణయ్,కె. సుధీర్ కుమార్, బి. రామారావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు, పెన్నులు పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

పట్టణంలోని డాంగే నగర్ నందు ఫిలజ్ఞోనియా గాస్పల్ సొసైటీ ఆధ్వర్యంలో రెవరెండ్.బి.సత్యపాల్, రెవరెండ్. వై రాజశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా ఎగ్జామ్ ప్యాడ్ మరియు పెన్నులు పంపిణీ కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు సామినేని వెంకట కష్ణ ప్రసాద్ బాబు పాల్గొన్నారు. ఈ సంద్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ సమాజానికి సేవ చేసే అవకాశం రావడం చాలా గొప్ప అదష్టమని, ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా సమాజానికి ఎంతో కొంత సేవ చేయాలని, ఉద్యోగంతో పాటూ సేవా కార్యక్రమాలు చేయడం గొప్ప విశేషమని అన్నారు. అదేవిదంగా ఏప్రిల్ నెలలో పదో తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో విద్యార్థులందరూ చదువుపై దష్టి సారించి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

తాడంకిలో గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-పమిడిముక్కల

పమిడిముక్కల మండలంలోని తాడంకి గ్రామం వద్ద తాము నిర్వహిస్తున్న తనిఖీల్లో భాగంగా మూడు కేజీల గంజాయిని పట్టుకున్నామని ఎస్ఐ సత్యనారాయణ చెప్పారు. తాడంకి గ్రామంలోని వంతెన వద్ద అనుమానితులను గుర్తించి ప్రశ్నించగా గంజాయి దొరికిందన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రత పరిరక్షణ కట్టుబడి ఉన్నామని తెలిపారు. మంటాడ వద్ద జాతీయ రహదారి వద్ద ట్రాఫిక్ నియంత్రణకు పగడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా ఎస్పి పి.జాషువా ఆదేశాల మేరకు నాటుసారా, గంజాయి వంటివి అక్రమ రవాణా చేయటం చట్టరీత్యా నేరమన్నారు. సంఘ విద్రోహ శక్తులను వదిలిపెట్టే ప్రసక్తి లేదని స్పష్టంచేశారు.

తనిఖీలను పర్యవేక్షిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

'చలో ఢిల్లీ' విజయవంతానికి పిలుపు

మాట్లాడుతున్న దుర్గారావు

ప్రజాశక్తి-విజయవాడ : ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు వారి సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చే నెల 5న జరిగే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజయవాడ సెంట్రల్ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు కె దుర్గారావు, ప్రధాన కార్యదర్శి హనుమంతరావు పిలుపునిచ్చారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెట్రోల్ ,డీజిల్ ,గ్యాస్ ,ధరలు ,పన్నులు తగ్గించాలని ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక పప్పుల మిల్లు, ప్రభాస్ కాలేజీ ఆటో స్టాండ్ వద్ద శనివారం ఆటో వర్కర్స్ యూనియన్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ఆటో కార్మికులతో గ్రూప్ మీటింగులు, కరపత్రాల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా దుర్గారావు, ఎం. హనుమంతరావు మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ సిఐటియు నిర్వహిస్తున్న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని ఆటో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. యం.వి. యాక్టు సవరణ చట్టం రద్దు చేయాలి. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి.ఆర్.టి.వో, ట్రాఫిక్ పోలీసులు అక్రమ జరిమానాలు ఆపాలని కోరారు. ప్రభుత్వం పెంచిన చలానా చార్జీలను ఉపసంహరించాలన్నారు. ఆటోల కొనుగోలుకు బ్యాంక్ ద్వారా తక్కువ వడ్డీతో రుణాలు మంజూరు చేయాలన్నారు. దేశంలో ఆటో ఉపాధిని దెబ్బతీసే ఓలా, ఓబర్ వంటి విదేశీ, ప్రైవేట్ కంపెనీలకు అనుమతి రద్దుచెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలేశ్వరరావు, నన్నే వలి, జబిల్, మరి యన్న, రహీం, కుమార్, ఫరీద్ పాల్గొన్నారు.

శివారెడ్డికి యార్లగడ్డ పరామర్శ

ప్రజాశక్తి -విజయవాడ రూరల్ : విజయవాడ రూరల్ మండలం నున్నలో కుమారుడును కోల్పోయిన వైసీపీ నేత అవుతు శివారెడ్డిని కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ యార్లగడ్డ వెంకట్రావు శనివారం పరామర్శించారు. గ్రామానికి చెందిన అవుతు శివారెడ్డి కుమారుడు శ్రీనివారెడ్డి (44)అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్న వెంకట్రావు శివారెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించి తమ ప్రగాడ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట పాల సొసైటీ అధ్యక్షులు బొంతు శ్రీనివాసరెడ్డి, భూముల బాలశేఖర్ రెడ్డి, శ్రీనివాస నాయక్, కిరణ్ కుమార్, బి హెచ్. సుదీప్ రెడ్డి,యర్ర్యారెడ్డి కోటిరెడ్డి, తదితరులు ఉన్నారు.

రైల్వే పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : రైల్వే పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేసే వారికి అండగా ఉంటామని పెన్షనర్స్ అసోసియేషన్ ఆఫ్ రైల్వేస్ జోనల్ జాయింట్ సెక్రటరీ ఎస్ కె చాంద్ బాషా అన్నారు. కొండపల్లి ఆదర్శ విద్యానికేతన్‌లో శనివారం రైల్వే పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ సెకండరీ ఫ్యామిటీ పెన్షన్ పొందేందకు అనేక సమస్యలు ఉన్నాయన్నారు. పెన్షన్ రద్దు కాకుండా వాటిని అధిగమించేందుకు సహకారం అందిస్తున్నామన్నారు. వైద్య పరంగా సమస్యలు వచ్చినపుడు కార్మికులకు అండగా నిలబడతున్నామన్నారు. విశ్రాంత ఉద్యోగులు వయస్సు రీత్యా వచ్చే ఆరోగ్య సమస్యలపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆంధ్రా హస్పటల్ ప్రముఖ వైద్యుడు డాక్టర్ కామినేని అచ్యుతబాబు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. కోస్టల్ బ్యాంకు సమకూర్చిన జ్యాట్ బ్యాగ్‌లను ఆవిష్కరించి విశ్రాంత ఉద్యోగులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జాకీర్‌హుస్సేన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ మహాబాషా ఆదర్శ విద్యానికేతన్ అధినేత ఎండి హబీబుల్లా రైల్వే హైస్కూలు విశ్రాంత ప్రదానోపాధ్యాయులు సూర్యప్రకాష్ పి జయచంద్రన్ ఎం వీరాస్వామి కె ప్రసాద్ ఎం శ్యామ్‌బాబు వరకుమార్ బి నాగభూషణం పాల్గొన్నారు.

మూత్రపిండాలు ఆరోగ్యంగా ఉండాలంటే

చక్కని జీవనశైలి అవసరం

- ప్రముఖ కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ వి.స్పందన

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : మూత్రపిండాల పనితీరు ఆరోగ్యంగా ఉండాలంటే జీవనశైలి చక్కగా ఉండాలని, మూత్ర పిండాల గురించి అవగాహన లేకపోతే అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రముఖ కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ వి.స్పందన అన్నారు. బెంజిసర్కిల్ వద్ద గల వాసవ్య నర్సింగ్ హోమ్ నందు డాక్టర్ సమరం అధ్యక్షతన ' మూత్రపిండాల వ్యాధులపై అవగాహన ' అనే అంశంపై శనివారం ఆరోగ్య సదస్సు జరిగింది. ఈసందర్భంగా డాక్టర్ స్పందన మాట్లాడుతూ మూత్రపిండాలు దెబ్బతినడంలో వంశపారంపర్యంగా వచ్చే వ్యాధులు కొన్ని కారణం కాగా వృద్ధాప్యం, ధూమపానం, అధిక రక్తపోటు, గుండె జబ్బులు, మధుమేహం, స్థూలకాయం, డాక్టరు సలహా లేకుండా మందులు వాడటం, తగిన నీరు తాగకపోవడం ప్రధాన కారణాలన్నారు. మన దేశంలో ప్రతి ముగ్గురు మధుమేహ రోగులలో ఒకరు మూత్రపిండాల డ్యాబేజీతో బాధపడుతున్నారన్నారు. అలాగే రక్తపెఓటు ఉన్నవాళ్లలో ప్రతి ఐదుగురిలో ఒకరికి మూత్రపిండాల పనితీరులో సమస్య తలెత్తుతుందన్నారు. మూత్రపిండాలు దెబ్బతిన్నవారిలో కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉంటాయని, వాటిని గుర్తించి ముందుగానే శ్రద్ధ తీసుకున్నట్లయితే మూత్రపిండాలను మరింత డ్యామేజి కాకుండా బాగుపరచుకోవచ్చని తెలిపారు. మూత్రపిండాలు వ్యాధిగ్రస్థమైన వాళ్లలో ఆకలి తగ్గిపోవడం, తేలికగా అలసిపోవడం, నీరసపడటం, నిద్రలేమి, వికారం, వాంతులు, కండరాల వణుకు, పాదాల వాపు, రక్తపోటు పెరగడం, తరచూ మూత్రం రావడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడినవారిలో కడుపులో నొప్పి, తరచూ మూత్రం రావడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడినవారిలో కడుపునొప్పి, వికారం, వాంతులు, మూత్రంలో రక్తం, తరచూ జ్వరం రావడం ఉంటుందని తెలిపారు. మూత్రపిండాలు లేదా మూత్ర వాహికల్లో ఇన్‌ఫెక్షన్ వచ్చినవారిలో చలితో కూడిన తీవ్రమైన జ్వరం రావడం, వాంతులు అవడం, మూత్రం మంటపుట్టడం, కడుపులో నొప్పి వంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు. మూత్రపిండాలు, మూత్ర వాహికలు వ్యాధులు రాకుండా ఉండాలంటే ధూమపానం, మానివేయాలని, మద్యపానం పనికిరాదని, అనవసరంగా మందులు వాడకూడదని , అధికంగా ఉప్పు తీసుకోకూడదని, మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవాలని , పౌష్టికాహారానిన తినాలని రోజూ అరగంట వ్యాయామం చేయాలన్నారు. మంచినీళు ఎక్కువగా తీసుకోవాలని, రక్తపోటుని తరచుగా పరీక్ష చేయించుకోవాలని అన్నారు. షుగరు ఉన్నవారు బిపి, ఉన్నవారు , గుండెజబ్బులు ఉన్నవారు. స్థూలకాయం పెరిగినవాళ్లు ఇతర మూత్రపిండాల వ్యాధులు ఉన్నవాళ్లు తరచూ డాక్టరుకి చూపించుకోవాలన్నారు. మూత్రపిండాల ఆరోగ్యం గురించి, నిర్లక్ష్యం పహిస్తే చాలా దుష్ఫలితాలుఎదుర్కోవలసి వస్తుందన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ మారు, పలువురు స్థానికులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

'ఇదేం ఖర్మ'లో 44వ డివిజన్ అధ్యక్షులు బొడ్డుపల్లి

ప్రజాశక్తి - భవానీపురం : చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ప్రజలు తమ అభిప్రాయాలు చెబుతున్నారని 44వ డివిజన్ తెలుగుదేశం అధ్యక్షులు బొడ్డుపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం శనివారం 44వ డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొడ్డుపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో డివిజన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డివిజన్ పరిధిలోని చెరువు సెంటర్, బిఆర్అంబేద్కర్ రోడ్‌లో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బొడ్డుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతు వైసీపీ పాలనలో ప్రజలు నానా కష్టాలు పడుతున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం గెలిచి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుతున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ బడుగు గణేష్, యూనిట్ ఇంచార్జ్ కుప్పిలి నాగబాబు, బూత్ కన్వీనర్ సరగడ నాగిరెడ్డి, చేబ్రోలు నాగమల్లేశ్వరరావు, గుంజ ఏడుకొండలు, కిలాని దుర్గారావు, కోలవెన్ను మురళీకష్ణ, గంగుల నాగేశ్వరావు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ముగిసిన అమ్మవారి చిన్న తిరునాళ్ల ఉత్సవాలు

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరునాళ్ళ ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు శనివారం భక్తులు బోనాలు సమర్పణతో ఉత్సవాలు ముగిసాయి. ఈనెల 7వ తేదీన ప్రారంభమైన అమ్మవారి ఉత్సవాలు ఐదు రోజుల పాటు ఘనంగా జరిగాయి. ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు ఊపిరి పీల్చుకున్నారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన శ్రీ తిరుపతమ్మ అమ్మవారి పుట్టింటి పసుపు కుంకుమ మహోత్సవం సమర్పణ, దివ్య ప్రభోత్సవం కార్యక్రమాలను ఆలయ, పోలీస్,రెవెన్యూ అధికారులు తో పాటు వివిధ శాఖల అధికారులు విజయవంతం చేయడంలో ప్రధాన పాత్ర పోషించారు. అలాగే ఎంపీడీవో, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ల ఆధ్వర్యంలో శానిటేషన్ పనులు ముమ్మరంగా నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆద్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఐదు రోజుల పాటు ఆలయం వద్ద వుండి సేవలు అందించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలు నుండి లక్షలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కు బడులు తీర్చుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలు ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి భక్తులకు ఇక్కట్లు లేకుండా చర్యలు చేపట్టారు. చివరి రోజు కూడా భక్తులు పాళ్ళ పొంగళ్ళు నిర్వహించి అమ్మవారికి సమర్పించి పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలను విజయవంతం చేసిన పలువురు అధికారులకు, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలకు ఆలయ కార్యనిర్వహణాధికారి లీలా కుమార్ చైర్మన్ చెన్న కేశవ రావు ధర్మకర్తలు లు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. కాగా శనివారం ఆలయం వద్ద వివిధ రకాల దుకాణాలకు నిర్వహించిన బహిరంగ వేలం పాటలు ద్వారా 12,75,850 రూపాయల ఆదాయం వచ్చిందని ఆలయ అధికారులు తెలిపారు.

కొత్తపల్లి సర్పంచ్‌కి పితృవియోగం

ప్రజాశక్తి-గంపలగూడెం : మండలంలోని కొత్తపల్లి గ్రామ సర్పంచ్ నరెడ్ల ఓగిరెడ్డి తండ్రి బూసిరెడ్డి (90) శనివారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయనకు భార్య, నలుగురు కుమారులున్నారు. రెండో కుమారుడు వీరారెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. పలు ఉపాధ్యాయ సంఘ నేతలు మతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళు లర్పించారు

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమం

- ఎన్టీఆర్ జిల్లా సిపిఎం కార్యదర్శి డివి కృష్ణ

మాట్లాడుతున్న సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : కేంద్ర, రాష్ట్ర ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ పిలుపునిచ్చారు. పట్టణంలోని డివిఆర్ నగర్‌లో గల సుందరయ్య భవన్ నందు మండల సిపిఎం సభ్యులు, సానుభూతిపరులు, ప్రజాసంఘాల సభ్యులతో శనివారం సిపిఎం సీనియర్ నాయకులు కోట కృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జెండాను పార్టీ సీనియర్ నాయకులు కాకనబోయిన లింగారావు ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన డివి కష్ణ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు పెట్రోల్, డీజిల్, నిత్యవసర వస్తువులు ధరల పెరిగి ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఇటీవల గ్యాస్ ధర పెంచి సంవత్సరానికి మూడున్నర లక్షల కోట్ల రూపాయలు భారం మోపిందన్నారు. కేంద్రం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ వలన పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదని, బడా పారిశ్రామికులకు అనుకూలంగా ఉందన్నారు. ప్రధాని మోడీ ఆదాని, అంబానీ వంటి వారి సేవలో మునిగితేలుతుందన్నారు. ఆయన దేశ ప్రజల కోసం పరిపాలన కాకుండా కార్పొరేట్ల కోసమే పరిపాలన చేస్తున్నట్లు ఉందన్నారు. సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్ సి హెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ప్రజావ్యత్రికక విధానాలు అమలు చేస్తుంటే రాష్ట్రంలో గల టిడిపి, వైఎస్ఆర్సిపి, జనసేన సైతం మాట్లాడకపోవడం శోచనీయం అన్నారు. సంపదపై పన్ను గతంలో 30 శాతం ఉంటే ప్రస్తుతం ఈ బడ్జెట్లో 22 శాతానికి తగ్గించిందన్నారు. బడ పారిశ్రామిక వ్యక్తులకు 12 లక్షల కోట్లు మోడీ ప్రభుత్వం రుణమాఫీ చేసిందనీ, దీన్నిబట్టి మోడీ ప్రభుత్వం పేదల కోసం కాదు పెద్దల కోసమేనని అర్థమవుతుందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ ఐక్యంగా పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న మోడీ ప్రభుత్వ విధానాలతో గత ఐదు సంవత్సరాలలో 28,572 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. నిరుద్యోగం, అధిక ధరలు, పేదరికం, ఆకలి మంటలు దేశాన్ని చుట్టిముట్టాయి అన్నారు. 2004తో పోలిస్తే ఆదాని సంపద 891 రెట్లు పెరిగిందన్నారు. రానున్న కాలం ఉద్యమాల కాలం అన ప్రజలందరూ ఈ ఉద్యమాలలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జగ్గయ్యపేట మండల, పట్టణ కార్యదర్శి సోమోజు నాగమణి, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు చిరుమామిళ్ల హనుమంతరావు, దంతాల వెంకటేశ్వర్లు, కాకనబోయిన లింగారావు, సిపిఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు, సానుభూతిపరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తరలింపును అడ్డుకున్న దళిత రైతులు

ప్రజాశక్తి-చల్లపల్లి

చల్లపల్లి మండల పరిధిలోని నిమ్మగడ్డ దళిత లంక భూముల సమీపంలో కృష్ణా నది నుండి అక్రమ ఇసుక తరలింపును నిమ్మగడ్డ దళిత రైతుల అడ్డుకోవడంతో అడ్డుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. గత కొద్దిరోజులుగా జగనన్న లేవట్ల పేరుతో టిప్పర్లతో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారని రైతులు ఆందోళన చేశారు. లంక భూముల పక్కన ఇసుక తవ్వటంతో భూగర్భ జలాలు తగ్గిపోతాయరీ, మంచినీరు ఉప్పునీరుగా మారుతాయని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. పంటలపై ఆధారపడి జీవించే తాము జీవనాధారం కోల్పోతావని విచారం వ్యక్తం చేశారు. ఇసుక త్రవ్వకాలను నిలిపివేయాలని కోరారు. ఇసుక మాఫియా ససేమిరా అంటూ పెద్ద ఎత్తున త్రవ్వకాలను చేపట్టడంతో గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారుల అలక్ష్యంతో ఇసుక టిప్పర్లను అడ్డుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. నిమ్మగడ్డ కృష్ణా నది తీరంలో ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న చల్లపల్లి ఎస్సై సిహెచ్ చినబాబు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని దళిత రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సోమవారం వరకు ఇసుక తోలకం ఆపేయాలని ఇసుక కాంట్రాక్టర్‌కు సూచించడంతో వ్యవహారం సర్దు మణిగింది. సరైన ఆధారాలతో ఇసుక తరలించాలని సూచించారు.

నిరసన తెలియజేస్తున్న దళిత రైతులు

విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డలోని ఎస్‌విఎల్ క్రాంతి జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఒక పూట కూడా మానకుండా కళాశాలకు వచ్చినందుకు వారికి ప్రోత్సాహకంగా 21 మందికి నగదు బహుమతులు అందజేశారు. కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.3000 చొప్పున 21 మందికి రూ.63 వేలు నగదు శనివారం కళాశాల వద్ద అందజేశారు. ఇందులో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 11 మంది ఉండగా ప్రథమ సంవత్సరం విద్యార్థులు 10 మంది ఉన్నారు. ఏటేటా కళాశాలకు మానకుండా వచ్చే విద్యార్థులను ప్రోత్సహించే విధంగా ఉమామహేశ్వరరావు ఈ కార్యక్రమం నిర్వహిస్తుంటారు. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.వి.నాగేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉమామహేశ్వరరావు

ఆవిర్భావ సభకు భారీ ఏర్పాట్లు

జనసేన మచిలీపట్నం నియోజకవర్గ ఇన్చార్జి బండి రామకృష్ణ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

ఈనెల 14న జరగనున్న జనసేన పార్టీ పదో ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సభకు మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ నుండి అత్యధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, అభిమానులు పాల్గొంటారన్నారు. జిల్లాల నుండి వచ్చే పార్టీ అభిమానులు సుమారు ఐదు లక్షల వరకు వుంటారని తెలిపారు. సభకు వచ్చే వారి కోసం 20 స్టాళ్ళలో భోజనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్నాక్స్, పుచ్చకాయ ముక్కలు,ఐదు లక్షల వాటర్ పాకెట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్టేజ్ వద్ద వివిధ హోదాల్లో గాలరీ,పోలీస్ బందోబస్తు ఉంటుందన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మధ్యాహ్నం మంగళగిరి పార్టీ కార్యాలయం నుండి వారాహి వాహనంలో రోడ్డు మార్గాన సాయంత్రానికి మచిలీపట్నం చేరుకుంటారని తెలిపారు. ఈ సమావేశంలో తిరుపతి, నరసాపురం కన్వీనర్లు కిరణ్ రాయల్,రసూల్,వంపుగడల చౌదరి, గల్లా తిమోతి తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నంలో

గన్నవరం : జనసేన పార్టీ 10 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం మచిలీపట్నంలో జరిగే బహిరంగ సభ కి ప్రజలు అధిక సంఖ్య లో రావాలని జనసేనా పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మధు సుదన్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం గన్నవరంలో ఆయన మాట్లాడారు. మండల పార్టీ నాయకులు పచ్చిపాల లక్ష్మణ్ రావు,పీతల మూర్తి యాదవ్,బండ్రెడ్డి రవి,విజయవాడ రూరల్ మండలం అధ్యకుడు పొదిలి దుర్గ రావు,కొలవెన్ను నాని,పెంకి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

గన్నవరంలో

మచిలీపట్నం రూరల్ : మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో శనివారం బీసీ రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయడం పట్ల జనసేన మచిలీపట్నం నగర అధ్యక్షులు గడ్డం రాజు హర్షం వ్యక్తం చేశారు.

పవన్‌తో గడ్డం రాజు

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి : బుద్ధ ప్రసాద్

ప్రజాశక్తి-అవనిగడ్డ

తాను అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ ఇస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆ ఊసే ఎత్తకపోవడం నిరుద్యోగులను మోసగించడమేనని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ విమర్శించారు. అవనిగడ్డలో డీఎస్సీ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులు శనివారం బుద్ధ ప్రసాద్‌ను ఆయన కార్యాలయం వద్ద కలిసి తమ గోడు వెళ్ళబోసుకున్నారు. డిఎస్‌సి ఇస్తారని నమ్మకంతో రాష్ట్ర నలుమూలల నుండి కోచింగ్‌కు వచ్చామని, ఇస్తారో ఇవ్వరో ప్రభుత్వం తేల్చి చెప్పకపోవడంతో అయోమయంలో ఉన్నామని వారు వాపోయారు. మాట తప్పని మడమ తిప్పనని చెప్పుకునే ముఖ్యమంత్రి డీఎస్సీ విషయంలో మాట తప్పారని బుద్ధ ప్రసాద్ విమర్శించారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే డీఎస్సీ ప్రకటించి పాదయాత్ర సమయంలో తాను ఇచ్చిన వాగ్దానాన్ని నిలుపుకోవాలన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి నిర్వహించాల్సిన టెట్ కూడా నిర్వహించకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఉపాధ్యాయులపై కక్షగట్టి వ్యవహరిస్తూ విద్యారంగాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్తారని ఆయన ప్రశ్నించారు. డీఎస్సీ కోసం 6.50 లక్షల మంది ఎదురుచూస్తున్నారని, వారి వయోపరిమితి కూడా దాటిపోతోందని వారు బాధపడుతున్నారన్నారు. ప్రస్తుత శాసనసభ సమావేశాల్లోనైనా డీఎస్సీపై ప్రకటన చేయాలని బుద్ధ ప్రసాద్ ముఖ్యమంత్రిని కోరారు.

ప్రవీణ్ ప్రకాష్ నిర్ణయం హర్షణీయం : దేవరపల్లి

ప్రజాశక్తి-చల్లపల్లి

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, వంట ఏజెన్సీల వేతనాలు చెల్లించే వరకూ తన జీతం బిల్లు చేయొద్దని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు. శనివారం చల్లపల్లిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవా సదన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయాలు,వంట ఏజెన్సీలకు చెల్లించే అతి తక్కువ వేతనాలను కూడా నెలలు తరబడి ఆలస్యంగా చెల్లించడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవీణ్ ప్రకాష్ తీసుకున్న నిర్ణయంతో కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించాలని కోరారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ఖర్చుల దృష్ట్యా కుకింగ్ ఏజెన్సీలకు చెల్లిస్తున్న ఖర్చుల మొత్తాన్ని పెంచాలని కోరారు. మారుమూల గ్రామాలలో ఉన్న ప్రాథమిక పాఠశాలలను సైతం సందర్శించి క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకుని అప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలు ఇవ్వడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డి.కోటయ్య, ఎం.సుబ్బారావు,ఎంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుడికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-ఉయ్యూరు

ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అంటూ పట్టణానికి చెందిన సంఘ సేవకురాలు నర్రాసుధారాణి, అన్నేరాణి బృందం ఆపదలో ఉన్నవారికి తోచిన విధంగా సాయం అందిస్తున్నారు. నగరపంచాయతీ రోడ్డులో డయాబెటిక్ వ్యాధితో ఓ కాలు కోల్పోయి వికలాంగుడై కుటుంబపోషణ కష్టతరంగా ఉన్న వృద్ధుడు వూకోటి ప్రసాద్ కుటుంబానికి రూ.5వేలు విలువచేసే నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృద్ధుడై వికలాంగుడి కుటుంబానికి జీవితాంతం ఆదుకోలేకపోయినా తోచిన విధంగా ఎంతో కొంత సాయం చేయడం ద్వారా మరికొంత మంది దాతలకు స్ఫూర్తిగా నిలవాలన్న లక్ష్యంతో సాయం చేశామన్నారు.

ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న నర్రా సుధారాణి

బూసిమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-ఉయ్యూరు

ఉయ్యూరు మండలం ముదునూరు గ్రామంలో బూసిమ్మ పేరంటాళ్ల తిరునాళ్ల వైభవంగా జరుగుతున్నాయి. గత తొమ్మిది రోజులుగా అత్యంత వైభవంగా జరుగుతున్న అమ్మవారి తిరునాళ్లకు పలు ప్రాంతాలనుండి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకుంటున్నారు. తెలంగాణలో స్థిరపడిన గ్రామానికి చెందిన పల్లపోతు భగవాన్ దాస్, మాజీ సర్పంచ్ పల్లపోతు శ్రీనివాసరావు తదితరులు శనివారం అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. తిరునాళ్లలో అత్యంత ప్రాముఖ్యమైన అమ్మవారి శిడిబండి ఆదివారం సాయంత్రం నేత్రపర్వంగా నిర్వహించనున్నారు. భగవాన్ దాస్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

జవాన్ మృతికి ఘననివాళి

ప్రజాశక్తి-ఉయ్యూరు

సీఐఎస్ఎఫ్ జవాన్ చింతా రమేష్ బాబు (53)కు సీఐఎస్ఎఫ్ జవాన్లు నివాళులర్పించారు. ఉయ్యూరుకు చెందిన రమేష్ బాబు విశాఖపట్టణం స్టీల్ ప్లాంట్లో ఉద్యోగం చేస్తూ శుక్రవారం రాత్రి గుండెపోటుతో మరణించాడు. ఆయన భౌతికకాయాన్ని స్వస్థలమైన ఉయ్యూరుకు శనివారం తీసుకువచ్చారు. అక్కడ నుండి వచ్చిన సీఐఎస్ఎఫ్ జవాన్లు అధికార లాంచనాలతో నివాళులర్పించారు. రమేష్‌బాబుకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దకుమార్తె తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలైన దృశ్యం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : విజయవాడ - నూజివీడు రోడ్డులో నున్న వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మరణించారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. విజయవాడ నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన ముగ్గురు టైల్స్ పనిచేస్తారు. నున్న శివారులోని సూరంపల్లిలో పని ముగించుకొని విజయవాడకు తిరిగి వెళుతుండగా, నున్న శివారులో బైక్ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొంది. దీంతో విజయవాడ బావాజీపేటకు చెందిన శేషప్ప రవి (36), లూనా సెంటర్‌కు చెందిన డి.నాగరాజు (32) అక్కడికక్కడే మరణించారు. సింగ్‌నగర్ చెందిన ఎస్.కె.ఇసుబ్ బాషా తీవ్రంగా గాయపడ్డారు. నున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు : ఎంఎల్ఎ జగన్మోహనరావు

ప్రజాశక్తి - కంచికచర్ల : వేసవిలో గ్రామాల్లో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు ఆదేశించారు. కంచికచర్ల మండలం కీసర గ్రామంలో శనివారం ఆయన పర్యటించారు. గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి, పోషకాహారం అందుతున్న తీరును పరిశీలించారు. గ్రామ సచివాలయం, ఆర్బికె, హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. అనంతరం అధికారులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో ప్రభుత్వ భవనాల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలన్నారు. త్వరలో పెండింగ్ బిల్లులు పడతాయన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీటి సరఫరా సక్రమంగా సరఫరా చేసేలా చూడాలన్నారు. పాంటింగ్ స్కీములు, మోటార్లు, పైపులైన్ పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పేర నర్సమ్మ, ఉప సర్పంచ్ చలమాల ప్రభాకర్, వైస్ ఎంపిపి బండి మల్లికార్జున్, జడ్పీటీసీ వేల్పుల ప్రశాంతి, నాయకులు పరిటాల రాము, వేల్పుల రమేష్, ఎంపీడీవో కె బాల శంకరరావు, కార్యదర్శి మీర్జావలి తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరుకు 'ఉపాధి' పని దినాల లక్ష్యం పూర్తి

ఇప్పటికి 67.30 లక్షల పని దినాల కల్పన

డ్వామా పీడీ జె.సునీత

కంచికచర్ల మండలం కొత్తపేటలో ఉపాధి పనులను పర్యవేక్షిస్తున్న డ్వామా పీడీ జె.సునీత

ప్రజాశక్తి - కంచికచర్ల : ఉపాధి హామీ చట్టం ద్వారా ఎన్‌టిఆర్ జిల్లాలో ఇప్పటివరకు 64 లక్షల 30 వేల పనిదినాలను కల్పించామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ జె.సునీత అన్నారు. ఈ ఏడాది 77 లక్షల పనిదినాలు కల్పించాలన్న లక్ష్యాన్ని మార్చి నెలాఖరునాటికి సాధిస్తామన్నారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కంచికచర్ల మండలం కొత్తపేటలో ఉపాధిహామీ పనులను, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ పనికోరిన ప్రతి కూలీకి ఉపాధిహామీ ద్వారా పనులు కల్పిస్తున్నామన్నారు. అమృత సరోవర్ పథకం ద్వారా 36 చెరువులను అభివృద్ధి చేయడంతోపాటు మైనర్ ఇరిగేషన్ ట్యాంక్‌లు, పంట కాలువలు, పంటబోదెలు, డొంకరోడ్లు అభివృద్ధి చేయడం, కందకాలు తవ్వడం వంటి పనులను చేపట్టినట్లు తెలిపారు. ఉపాధిహామీ కూలీలకు వారు చేసిన పనుల ఆధారంగా రోజుకు సగటున రూ.242 వేతనం లభించేలా చర్యలు తీసుకున్నామన్నారు. కూలీలకు ఎప్పటికప్పుడు వేతనాలను చెల్లిస్తున్నామన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న చెత్తనుండి సంపద తయారీ కేంద్రాలను (ఎస్‌డబ్ల్యుపిసి) సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్‌డబ్ల్యుపిసి ల ద్వారా తయారైన వర్మీ కంపోస్ట్‌ను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించి రైతులను చైతన్యవంతులను చేసి వర్మీ కంపోస్ట్‌ను ఉపయోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పంటలకు, మొక్కల పెంపకానికి వర్మీ కంపోస్టును వినియోగిస్తున్నామని తెలిపారు. ఇళ్ల నుండి చెత్తను సేకరించే సమయంలో తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని పారిశుధ్య కార్మికులను ఆదేశించామన్నారు. జిల్లాలో 288 గ్రామ పంచాయతీల్లో 265 ఎస్‌డబ్ల్యు పిసి షెడ్ల నిర్మాణాలను పూర్తి చేసి సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. మరో 23 షెడ్ల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉందని, దీనిలో 12 బేస్మెంట్ దశలో, 4 పిల్లర్ దశలో ఉన్నాయని చెప్పారు. మరో 7 షెడ్ల నిర్మాణ పనులు ప్రారంభించాల్సి ఉందని తెలిపారు. షెడ్ల నిర్మాణం పనులను త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని సునీత తెలిపారు.

చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం

అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - విజయవాడ : అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణీలకు సేంద్రియ పద్దతుల ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరలను వినియోగించి మెరుగైన పౌష్టికాహారాన్ని అందించాలని, అంగన్వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్, న్యూట్రి గార్డెన్, మునగ చెట్ల పెంపకానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు మహిళా శిశు సంక్షేమ అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలలో పౌష్టికాహార వినియోగంపై శనివారం ఆయన మహిళా శిశు సంక్షేమ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1475 అంగన్వాడీ కేంద్రాల ద్వారా 93 వేల మంది చిన్నారులకు, 8,700 మంది గర్భిణులకు, 10,300 మంది బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 50 శాతం అంగన్వాడీలలో కిచెన్ గార్డెన్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.ఉమాదేవి, సిడిపివోలు మంగమ్మ, టి.నాగమణి, భాగ్యరేఖ, లక్ష్మి భార్గవి, లలిత, కె.పుష్పలత, సత్యవతి పాల్గొన్నారు.



కుంగ్‌ఫూ, కరాటేలో విస్సన్నపేట 'చైతన్య'కు పతకాలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నేషనల్ ఓపెన్ కుంగ్‌ఫూ, కరాటే ఛాంపియన్‌షిప్‌లో విస్సన్నపేట శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు విజయం సాధించారు. విజయవాడ లెనిన్ సెంటర్లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భవన్ వద్ద ఈ పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో శ్రీ చైతన్య సంస్థల నుంచి 600 మంది విద్యార్థులు పాల్గొనగా, విస్సన్నపేట శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు కటా విభాగంలో విస్సంపల్లి మానస, కొప్పనాతి ఆరాధ్య బంగారు పతకాలు, కె.హేమచందన్ కాంస్య పతకం సాధించారు. అలాగే కాకాని కళ్యాణ మండపంలో జనవరి 29న జరిగిన ఏపి ఓపెన్ కింగ్‌ఫూ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో 600 మంది పాల్గొనగా, బాణావతు మనోహర్ బంగారు పతకం, ఎస్.ప్రణీత, కె.ఆరాధ్య రజిత పతకాలు సాధించారు. విజయం సాధించిన విద్యార్థులను, కరాటే మాస్టర్ విద్యాసాగర్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ పవన్ కుమార్ అభినందించారు. అనంతరం డిప్యూటీ తాసిల్దార్ బాణావత్తు మోత్య, ఆర్‌ఐ జి.వెంకటేశ్వరరావు విజయం సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, పతకాలు బహూకరించారు. ఈకార్యక్రమంలో డీన్ దుర్గాబాబు, ఆర్‌ఐ నరేంద్ర, ఇఇ ఎం.మురళీకృష్ణ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, PALADUGU VEERA PRAKASA RAO (Old Name) S/o. Paladugu Bapaiah, R/o. Plot No. 306, Bhargavi Nagar, Chinna Avutapalli (V), Gannavaram, Krishna Dist.-521 101, A.P. I, declare that I have changed my name to **PALADUGU VEERA PRAKASH RAO** (New Name). Hereafter my name is known as **PALADUGU VEERA PRAKASH RAO** only.

దస్తావేజు డాక్యుమెంట్ పోయినది

ఎన్టిఆర్ జిల్లా నందిగామ గ్రామ కాపురస్తురాలు మహమ్మద్ రమీజున్నీసబేగం భర్త యాకూబ్ సంబంధించిన ఇంటి దస్తావేజు డాక్యుమెంట్ పోయినది. దస్తావేజు నెం. 2265/1984. డోర్ నెం.8-130లోని 87 గజాల ఇంటి దస్తావేజు డాక్యుమెంట్‌ను మార్చి 2023, 4వ తేదీన బ్యాగులో పెట్టుకుని జిరాక్స్ నిమిత్తం గాంధీ సెంటర్ వెళ్తుండగా మార్గమధ్యలో జారిపోయినవి. సదరు దస్తావేజు డాక్యుమెంట్ దొరికిన వారు సెల్ నెం.9700805633కు అందజేయగలరు. తగిన పారితోషికము ఇవ్వబడును.

IN THE COURT OF THE HON'BLE III ADDL DISTRICT JUDGE MEDCHAL-MALKAJIGIRI DISTRICT AT :: KUKATPALLY

FC.OP.NO. 173 OF 2020

Between:
Smt.Vasireddy Satya Hema ...Petitioner
AND
Sri.Vasireddy Rajashekhar ...Respondent

To,
Sri.Vasireddy Rajashekhar, S/o.VasireddySadasiva Rao, aged about 40 years, R/o.H.No.5-62, Near Railwy gate, Rayanpadu, Krishna District 521241

PUBLIC NOTICE

Please take notice that, the above said the above FC.OPhas been filed by the Petitioner seeking relief of Divorce and the said matter has been posted to 29.03.2023 for your appearance. Please be present before the above said Hon'ble Court on **29.03.2023** at **10.30** AM either in person or through Pleader, failing which the matter shall be decided ex-parte.

(By order of the court)

Pabba Santosh Kumar
Advocate
Office 1st Floor, H.No.5-35/212/A, Adjacent to Kukatpally Court complex, Prashanth Nagar, Kukatpally Hyderabad. Also at Ground Floor, SVSKL Mansion,3-6-369/A/18, Street No.1, Himayathnagar, Hyderabad-500029.
Mobile No.9394874969
Email: pabbasantoshkumar@gmail.com

IN THE COURT OF THE PRINCIPLE SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA
O.S. 264/2021 In IA 354/2022

Between :
Pilla Amarnadh ... Plaintiff / Petitioner
Vs
1. Gadamsetty Sivaiah (died)
2. Gadamsetty Adilakshmi, W/o Late Sivaiah
3. GadamsettyKumar, S/o Late Sivaiah
4. Gadamsetty Kiran Babu S/o Late Sivaiah
... Respondents / Proposed Defendents 2 to 4

పై నెంబరు దావాలోని ప్రతివాది 26-02-2022న చనిపోయినందున వారి స్థానే 2 to 4 వారలను సదరు శివయ్యగారి వారసులుగా చేర్చి ఈ దావా గ్రంథమును జరిపించమని వాది దాఖలు చేసిన పిటీషనుపై సదరు 2 to 4 ప్రపోస్ డిఫెండెంట్స్‌కు ఏమైనా అభ్యంతరములు వున్నయెడల ది. 03-04-2023 ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట హాజరై తెలుపుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానింపబడును.

విజయవాడ
తేది :10-3-2023 ఇట్లు
BEERAM SUBBA RAO,
Advocate for Plaintiff.

మొదటి పేజీ తరువాయి

నీటి మీటర్లపై ఏ సవాల్‌కైనా సిద్ధం

నెలలుగా వీటికి వ్యతిరేకంగా తాము ఆందోళనలు నిర్వహిస్తున్నామని, అయినా అవాస్తవాలు వల్లె వేస్తూ, ప్రజలను తప్పుదారి పట్టించడానికి వైసిపి ప్రజాప్రతినిధులు ప్రయత్నించడం తగదన్నారు. ఎంఎల్ఎ విష్ణు, మేయర్, ఇతర అధికార ప్రజా ప్రతినిధులు ఈ సవాల్‌ను స్వీకరించిన తేదీ, సమయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈనెల 15వ తేదీలోపు దీనిపై స్పందించాలన్నారు. మధురానగర్‌లో నీటి మీటర్లు పెట్టిన విషయాన్ని గుర్తించి ఎంఎల్ఎ విష్ణు ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పెట్టిన మీటర్లను తొలగించాలని, భవిష్యత్తులో మీటర్లు పెట్టబోమని ప్రభుత్వం తరపున ప్రకటించాలని కోరారు. లేకపోతే ప్రత్యక్ష పోరాటానికి కూడా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అనంతరం నీటి మీటర్లు పెట్టిన విషయాన్ని ఆధారాలతో సహా మీడియా ముందుంచారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ ఇంటి పన్ను పెంపు, చెత్త పన్ను, నీటి మీటర్లు తదితర రూపాల్లో ప్రజలపై భారాలు వేసేందుకు వైసిపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. విఎంసి బడ్జెట్‌పై ప్రజాభిప్రాయాన్ని, ప్రతిపక్షాల సూచనలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా, నిరంకుశంగా ఆమోదించారని విమర్శించారు. స్థానిక సంస్థల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మళ్లించి తన ఖజానాలో వేసుకుంటోందన్నారు. ప్రభుత్వం నుండి గ్రాంట్లు రాకపోయినా నగరంలోని ప్రజా ప్రతినిధులు మిన్నకుండిపోవడం సిగ్గుచేటన్నారు. సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ నగరంలో ఇంటి పన్నులను గత రెండేళ్లలో రూ.100 కోట్ల నుండి రూ.200 కోట్లకు, మంచినీటి పన్నులను రూ.29 కోట్ల నుండి రూ.49 కోట్లకు పెంచారని విమర్శించారు. ఇంపాక్ట్ ఫీజు పేరుతో రూ.10 కోట్ల భారం మోపుతున్నారని అన్నారు. స్విమ్మింగ్ పూల్స్, పార్కులు, పార్కింగ్ స్థలాలు దేనినీ వదిలిపెట్టకుండా ప్రజలపై తీవ్రమైన భారాలు వేస్తున్నారని తెలిపారు. చెత్త పన్ను పేరుతో ఏడాదికి అదనంగా రూ.15 కోట్లు రాబట్టడానికి ప్రతిపాదనలు పెట్టారని తెలిపారు. రెవెన్యూ ఆదాయం పేరుతో భారాలను రూ.502 కోట్ల నుండి రూ.859 కోట్లకు పెంచారని తెలిపారు. నగరంలోఅభివృద్ధి కార్యక్రమాలు పూర్తిగా స్తంభించిపోయాయని, కనీసం టెండర్లు వేయటానికి కూడా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం గమనార్హమని అన్నారు. మురికివాడలు, కాలనీల అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని, ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు కేటాయించలేదని విమర్శించారు.

వైఎస్ఆర్ శంకుస్థాపన చేసిన ప్రాంతంలోనే బందరు పోర్టు నిర్మాణం

పోర్టు నిర్మాణానికి సూచకగా మేకావానిపాలెంలో పైలాన్‌ను మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. మంగినపూడి సముద్రతీర భూముల్లో యంత్రాలతో పనులు ప్రారంభించారు. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం కాంట్రాక్టు సంస్థ నవయుగతో నిర్మాణ ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. ఆ తర్వాత మెగా ఇంజనీరింగ్ సంస్థ పోర్టు నిర్మాణ టెండరును దక్కించుకుంది. ఈనెలాఖరులోగానీ, ఏప్రిల్ మొదటి రెండు వారాల్లోగానీ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసిన ప్రాంతంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పోర్టు నిర్మాణ పనులు ప్రారంభిస్తారని అధికారులు చెబుతున్నారు. దీనికి అవసరమైన ఏర్పాట్లను కూడా చేస్తున్నారు.

క్రీడా పరికరాలు అందజేత

ప్రజాశక్తి-కోడూరు

కోడూరు శివారు స్వతంత్రపురం శ్రీ చామర్తి ప్రకాశ్రయ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 1985-86 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన

క్రీడాపరికరాలను అందజేస్తున్న దాతలు

విద్యార్థులు శనివారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆలా వెంకట రమణకు రూ.60 వేలు విలువ గల క్రీడా పరికరాలు, ఇనుప బీరువా, 200 మీల్స్ ప్లేట్లు, 400 స్టీల్ గ్లాసులు అందించారు. క్రీడా సామాగ్రి బహూకరించిన విద్యార్థి నాయకులకు పాఠశాల విద్యా కుటుంబం ఘనంగా సత్కరించి అభినందించారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎస్ పి ఎల్ ఎన్ వి ఎస్ పూర్ణచంద్రరావు, డి.రవీంద్రబాబు, కె.రవికుమార్, బివి రమణ, వి ఎస్ ఆర్ కృష్ణ, కె శ్రీనివాసరావు, సిహెచ్ గోవిందరాజులు, జీ ప్రసాద్, ఓ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు గుమ్మడి విజయకుమార్‌కు సత్కారం

ప్రజాశక్తి-గుడివాడ

కృష్ణాజిల్లా వైసిపి సాంస్కృతిక విభాగం అధ్యక్షులుగా నియతులైన గుమ్మడి జయరాజు కుమారుడు గుమ్మడి విజయకుమార్‌ను ఆదివారం కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో సన్మాన సభను నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షులు విన్నకోట సత్యనారాయణ(పద్మామైక్ బుజ్జి) శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సమైఖ్య కమిటి అధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6గంటలకు స్థానిక శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో గుమ్మడి విజయకుమార్‌ను సత్కరిస్తు సన్మాన సభను ఏర్పాటు చేశామన్నారు." వైసీపి పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, సమైఖ్య గౌరవ అధ్యక్షుడు బి.రామమోహనరెడ్డి, జవ్వాజి గంగరాజు, కె.ఎస్ అప్పారావులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని వివరించారు. శ్రీరామాంజనేయ యుద్ధం (వారోసీను), మ్యూజికల్ నైట్ కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

గుడివాడ డిఎం రాజేష్‌కుమార్

ప్రజాశక్తి-గుడివాడ

గుడివాడ పరిసర ప్రాంతాల ప్రయాణికులు, భక్తులకు ఏపిఎస్ఆర్టీసీ గుడివాడ డిపో నుండి ప్రతినెల పౌర్ణమి రోజు అరుణాచలమునకు గిరి ప్రదక్షిణ చేసుకోవటానికి భక్తులకు సూపర్ లగ్జరీ బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్‌టిసి డిఎం జి.రాజేష్‌కుమార్ తెలిపారు. అరుణాచలానికి ఆర్‌టిసి బస్సును ఏప్రిల్ 4న రాత్రి 8 గంటలకు గుడివాడ నుండి బయలుదేరి 5న

ఉదయం శ్రీకాళహస్తి, వంద్యాపాణం కాణిపాకం విఘ్నేశ్వర స్వామి దర్శనం చేసుకుని, సాయంత్రం సిరిపురంలో గోల్డెన్ టెంపుల్ చేరుకుని దర్శనం చేసుకునేలా ఏర్పాటు చేశామన్నారు. అదే రోజు రాత్రి బయలుదేరి 6న పౌర్ణమి రోజు ఉదయం అరుణాచలం చేరుకుని గిరి ప్రదక్షిణ దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. 6న సాయంత్రం బస్సు బయలుదేరి 7న ఉదయం 7.00 గంటలకు గుడివాడకు చేరుకుంటుందన్నారు. సూపర్ లగ్జరీ బస్సు.2=2 సీటర్. పుష్ బ్యాక్, టికెట్ ధర రూ.3000 నిర్ణయించామని వివరించారు.

పిల్లలను ఇంటి వద్దా చదివించండి

ప్రజాశక్తి - మొవ్వ

ఏప్రియల్ మూడో తేదీ నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు పిల్లలను ఇంటి వద్ద కూడా చదివటానికి చర్యలు తీసుకోవాలని కూచిపూడి జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అన్నే లక్ష్మీకుమారి

మాట్లాడుతున్న అన్నే లక్ష్మీకుమారి

సూచించారు. విద్యాశాఖ ఆదేశాలతో శనివారం 10వ తరగతి పిల్లల తల్లిదండ్రులతో పాఠశాలలో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. జగనన్న గోరుముద్ద ద్వారా తాము అందించే ఆహారంతో పాటు ఇంటి వద్ద కూడా పిల్లలకు ప్రోటీన్స్ కలిగిన బలవర్ధకమైన ఆహారం అందించి మరింత శక్తివంతులుగా తీర్చిదిద్దాలని ఆమె తల్లులకు సూచించారు. ఈ సందర్భంగా ప్రతిఆదివారం, సెలవు రోజుల్లో సైతం నిర్వహించే ప్రత్యేక తరగతులకు పంపించాలని సూచిస్తూ ఈ విషయంలో ప్రతిరోజూ శ్రద్ధ తోపాటు ఆరా కూడా తీసుకోవాలని పేరెంట్స్‌కు అవగాహన కల్పించారు. తాము పిల్లల్లో చదువు పట్ల ఉన్న సామర్థ్యాన్ని బట్టి ఏ,బి,సి,డి, విభాగాలుగా విభజించి చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెట్టి చదివించగలమనిన్నారు. ఇంటి వద్ద కూడా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు గుంటూరు వెంకట సత్యప్రసాద్,పామర్తి శ్రీనివాసరావు, ఆలూరి సురేష్, పేరెంట్స్ మానిటరింగ్ కమిటీ చైర్మన్ జుజ్జవరపు మంగమ్మ పలువురు ఉపాధ్యాయులు, భట్లపెనుమర్రు, పెదసనగల్లు, చినముత్తేవి, నిడుమోలు, కాజ, కోసూరు, పెదముత్తేవి, మొవ్వ హైస్కూల్స్ లోనూ పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించారు.

నగదును అందజేస్తున్న వైసిపి నాయకులు

దేవాలయానికి రూ.4 లక్షల విరాళం

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్(గన్నవరం)

బాపులపాడు మండలం బొమ్ములూరు గ్రామంలో ఎన్ హెచ్ 16 రోడ్డు విస్తరణలో పోయిన శ్రీ సీతారామస్వామి ఆలయం అభివృద్ధికి గన్నవరం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్ రూ.4 లక్షలు విరాళంగా అందజేశారు. రోడ్డు విస్తరణలో ఆలయాన్ని తొలగించాల్సివచ్చింది. ఈ విషయాన్ని గ్రామ పెద్దలు స్థానిక శాసనసభ్యులు వల్లభనేని వంశీ మోహన్ కు తెలియజేయగా తక్షణమే స్థల సేకరణ చేసి ఆలయ పున:నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. శనివారం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గన్నవరం పార్టీ కార్యాలయంలో రూ.4 లక్షల విరాళాన్ని ఆలయ అభివృద్ధికి వినియోగించాలని ధర్మకర్త, గుడి నిర్వహణ కమిటీ సభ్యులకు అందజేశారు. బాపులపాడు మండల అధ్యక్షులు నక్కా గాంధీ, మండల కన్వీనర్ అవినేని శేషగిరి, బాపులపాడు ఎంపీపీ యర్రగుళ్ల నగేష్,బాపులపాడు పిఎస్సిఎస్ అధ్యక్షులు యర్రంశెట్టి వెంకట రామాంజనేయులు, గన్నవరం ఎంపీపీ అనగాని రవి, గన్నవరం జెడ్పిటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, గన్నవరం మార్కెట్ యార్డ్ బోర్డు సభ్యులు గండేపూడి రాణి, గ్రామ ఎంపీటీసీ సభ్యులు శిరీష రాంబాబు, గ్రామ సర్పంచ్ కాటూరి విజయభాస్కర్, గ్రామ మాజీ సర్పంచ్ మట్ట వెంకటేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు దాసరి ఉదయరాజు, పెద్దలు పాల్గొన్నారు.

బాపులపాడులో చలివేంద్రం ప్రారంభం

గన్నవరం-(హనుమాన్ జంక్షన్)

వేసవి ఎండలు మండుతున్న నేపథ్యంలో సమాచార హక్కు చట్టం ప్రచార సమితి అమరావతి వారు కరీం అంబులెన్స్ సర్వీస్ సౌజన్యం తో పాదచారుల దాహార్తిని తీర్చేందుకు బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్ ఆర్టీసీ బస్టాండ్ దగ్గర చలివేంద్రం ప్రారంభించారు. రాష్ట్ర నాటక రంగ అకాడమీ డైరెక్టర్, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు నక్కా గాంధీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. బాపులపాడు జెడ్పిటీసీ సభ్యురాలు గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, బాపులపాడు గ్రామ సర్పంచ్ సరిపల్లి కమలా భాయ్ హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రచార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కోటా సురేష్ రాష్ట్ర కార్యదర్శి షేక్ కరీం భాష జిల్లా కన్వీనర్ తిరుమలశెట్టి రవి మండల కన్వీనర్ కాళి కిరణ్ బాబు కార్యదర్శి రాంబాబు సహాయ కార్యదర్శి రాజ రమేష్ కార్యవర్గ సభ్యులు కోట చైతన్య నూకల శ్రీకాంత్ కంపాటి ప్రసాద్ సామాజిక ప్రజా చైతన్య వేదిక అధ్యక్షులు మట్టా ప్రసాద్ పెదపాడు మాజీ ఎంపీటీసీ కిరణ్ అప్పారావు పేట మాజీ సర్పంచ్ చలపతి పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నక్కా గాంధీ తదితరులు

వీరపనేనిగూడెం హైస్కూల్ హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం మండలం వీరపనేనిగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎ.వెంకటేశ్వరరావు విధుల పట్ల నిర్లక్ష్యం, అసమర్ధమైన పరిపాలనతో తోటి ఉపాధ్యాయులను ఇబ్బంది పెడుతున్న దృష్ట్యా సర్వీస్ నుండి సస్పెన్షన్ చేస్తూ స్కూల్ ఎడ్యుకేషన్, జోన్-2, కాకినాడ ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి ఉత్తర్వులు జారీ చేశారు. మచిలీపట్నం జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదులు వెళ్ళగా ఆమె విచారణ చేసి తయారు చేసిన రిపోర్టు కాకినాడ ఆర్‌జెడి కార్యాలయానికి పంపారు. అందులోని వివరాలను పరిశీలిస్తే వీరపనేనిగూడెం జెడ్‌పిహెచ్ పాఠశాల ఉపాధ్యాయులను రెండు గ్రూపులుగా హెచ్‌ఎం విభజించారు. పాఠశాల విద్యార్థుల సమక్షంలో పాఠశాల ఆవరణలో ఒకరితో మరొకరు వాగ్వాదానికి దిగేవారు. ఇది తన చట్టబద్ధమైన విధుల పట్ల నిర్లక్ష్యం, నిర్లక్ష్యం, అవిధేయత, అసమర్థమైన పరిపాలనను ప్రదర్శిస్తోందని పేర్కొన్నారు. హెచ్‌ఎం ఎ.వెంకటేశ్వరరావుపై క్రమశిక్షణా చర్యలకు రిపోర్ట్ పెట్టారు. అందుబాటులో ఉన్న మెటీరియల్‌ని జాగ్రత్తగా పరిశీలించి, కేసు పరిస్థితుల దృష్ట్యా ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ ఉత్తర్వులను అందించిన తేదీ నుండి సస్పెండ్ చేయబడింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు లేదా అతనిపై ఆలోచించిన క్రమశిక్షణా చర్యలు ముగిసే వరకు సస్పెన్షన్‌లో కొనసాగుతారని పేర్కొన్నారు. సస్పెన్షన్ వ్యవధిలో ఎ.వెంకటేశ్వరరావుకు నిబంధనల ప్రకారం జీవనాధార భత్యం చెల్లించాలని ఆదేశించినట్లుగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా మరో ఇద్దరు ఉపాధ్యాయులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటూ ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు.

ప్రాంగణ ఎంపికల్లో ఉషారామ విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-ఉంగుటూరు(గన్నవరం)

ఉంగుటూరు మండలం తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో హుండయ్ మొబీస్, కియా మోటర్స్ సంస్థ ఆధ్వర్యంలో క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించినట్లు కళాశాల

ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు

చైర్మన్ సుంకర రాంబ్రహ్మం శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ హుండయ్ మొబీస్, కియా మోటర్స్ సంస్థ ప్రతినిధులైన సుధాకర్ పాల్గొన్నారు. ఈ ఎంపిక పరీక్షల్లో డైరెక్ట్ ఇంటర్వ్యూలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ ఎంపికల్లో ఉషారామా కళాశాలకు చెందిన 34 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం, డైరెక్టర్ డాక్టర్ కె.రాజశేఖర్‌రావు, ప్రిన్సిపల్ డాక్టర్ జి వి కె ఎస్ వి ప్రసాద్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

వీరవల్లి ఎస్ఐ సుబ్రహ్మణ్యం బదిలీ

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్(గన్నవరం)

బాపులపాడు మండలం వీరవల్లి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్‌గా పనిచేస్తున్న యుఎల్. సుబ్రమణ్యం బదిలీ అయ్యారు. ఆయన్ను హనుమాన్ జంక్షన్ 2 ఎస్సైగా నియమించారు. నందివాడ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.చిరంజీవి బదిలీపై వీరవల్లి ఎస్సైగా రానున్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు జాకీర్ హుస్సేన్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఆల్‌ఇండియా ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీ లకు డాక్టర్ జాకీర్ హుస్సేన్ కళాశాలకు చెందిన క్రీడాకారులు ఎంపిక కావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ మహాభాష హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ అన్వరుల్లా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జాఫర్ సాదిక్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు మస్తాన్‌వలీ నాగుల్‌మీరా పాల్గొని మాట్లాడుతూ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు పంజాబ్ రాష్ట్రం మోహిలీలోని చండీఘుర్ యూనివర్సిటీలో జరుగనున్నట్లు తెలిపారు. ఈ పోటీలు మార్చి 14 నుండి 18వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఈ క్రీడా బందంలోతమ కళాశాలకు చెందిన 61 కేజీల విభాగంలో ఎం నాగరాజు, 67 కేజీల విభాగంలో ఎం చరణ్, 73 కేజీల విభాగంలో సిహెచ్ వెంకటేష్, 81 కేజీల విభాగంలో జె కోటేశ్వరరావు, 89 కేజీల విభాగంలో ఎస్కే రషీద్, 96 కేజీల విభాగంలో ఆర్కే నాగరాజు, 190 ప్లస్ కేజీల విభాగంలో జి రాజశేఖరులు ఉన్నారని తెలియజేశారు. దేశంలోని సుమారు 70 విశ్వవిద్యాలయాలకు చెందిన క్రీడా బృందాలు ఈ పోటీలలో పాల్గొంటాయని తెలిపారు. కృష్ణా యూనివర్సిటీకి ప్రాతినిధ్యం వహించే ఈ బృందానికి మేనేజర్‌గా కె లీలావాణి, కోచ్‌గా విఎస్‌రాజశేఖర్ నాయకత్వం వహిస్తారని తెలియజేశారు.

కొనసాగుతున్న అన్న క్యాంటీన్

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : టీడీపీ జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ ఆధ్వర్యంలో నడుస్తున్న అన్నా క్యాంటీన్ శనివారం 250వ రోజు కూడా అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని మైనేని రాధ కష్ణ, గుంజ నర్సయ్య, షేక్ షరీఫ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో షేక్ కొర్రకూటి సైదులు , పల్లెలపటి సత్య, శ్రీనివాసరావు, గంజి కొండ, వేట వెంకయ్య, సర్వేపల్లి శ్రీను, మరియు ఎస్ ఎల్ టి సిబ్బంది బాల, షేక్ నాగులుమీర, సైదా తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

- కృష్ణాజిల్లా జడ్‌పి చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్ : విద్యలోనే కాకుండా అన్ని రంగాలలోనూ బాలికలు మరింతగా రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారక అన్నారు. గ్రామీణ ప్రాంత రైతు కుటుంబాల చిన్నారులు ఉన్నత విద్యను అభ్యసించే ఉద్దేశంతో కోరమండల్ ఇంటర్నేషన్ లిమిటెడ్ ఏటా కోట్లాది రూపాయలను స్కాలర్‌షిప్‌లుగా అందజేయటం ముదావహమన్నారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె) ఆవరణలో కార్పొరేట్ సామాజిక బాధ్యతలో (సిఎస్‌ఆర్) బాధ్యతగా గతేడాది తొమ్మిదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కబనబరిచిన ఉమ్మడి కష్ణాజిల్లాకు చెందిన 237 విద్యార్థినులకు రూ.15 లక్షల విలువైన నగదు పురస్కారాలను జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక శనివారం అందజేశారు. తొలుత ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఈ ఏడాది ఉత్తమ మహిళ రైతు అవార్డును తోట్లవల్లూరు మండలం పాముల్లంకకు చెందిన పాముల రాణికి అందజేసి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హారిక మాట్లాడుతూ కోరమండల్ సంస్థ 18 సంవత్సరాలుగా పలు జిల్లాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బాలికలకు మొదటి బహుమతిగా రూ.5 వేలు, రెండో బహుమతిగా రూ.3,500 అందించడం అభినందనీయమన్నారు. బాలికలు విద్యారంగంలో మరింత రాణించి, భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను చేరుకాలన్నారు. కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ హెచ్‌ఆర్ ఇన్‌చార్జి కొండిపర్తి సుధాకర్ (శ్రీనివాస్) అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎన్‌టిఆర్ జిల్లా వ్యవసాయాధికారిణి ఎం విజయభారతి, కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఉపాధ్యక్షుడు జివి సుబ్బారెడ్డి, రీజనల్ బిజినెస్ హెడ్ కెఎస్‌ఆర్ చక్రవర్తి, డిజిఎం ఎం సచ్చిదానందరెడ్డి, డివిజనల్ అగ్రామినిస్ట్ మోహన్‌కుమార్, సీనియర్ అగ్రామినిస్ట్ పథ్వీలాల్, హెచ్‌ఆర్ గాయత్రి, మేనేజర్ హరి, అకౌంట్స్ ఇన్‌చార్జి భవానీ తదితరులు పాల్గొన్నారు.

మలబార్‌లో నృత్యాంజలి కలెక్షన్స్ విడుదల

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూమ్‌లో శనివారం నృత్యాంజలి కలెక్షన్స్‌ను ఆవిష్కరించినట్లు ఎం.జి.రోడ్డులోని గల మలబార్ షోరూమ్ హెడ్ నిఖిల్ చంద్రన్ తెలిపారు. ఈసందర్భంగా షోరూమ్ నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతీయ సంప్రదాయ నృత్య రూపాలను స్వచ్ఛమైన బంగారంపై చెక్కి నృత్యాంజలి పేరుతో అద్భుతమైన ఆభరణాలను అందిస్తున్నట్లు తెలిపారు. హస్తకళా నైపుణ్యం ఉట్టిపడే ప్రతి ఆభరణం 100 శాతం బిఐఎస్ హాల్‌మార్క్ చేయబడిన స్వచ్ఛమైన బంగారంతో తయారుచేయబడిందన్నారు. వివిధ రకాలైన డిజైన్లతో పాటు నెక్లెస్‌లు, చెవి పోగులు, ఉంగరాలు, గాజులు వంటి ఆభరణాలు ప్రత్యేకంగా ఉంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని నగరంలోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్డర్లపై కూడా ఆభరణాలను అందించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో పలువురు షోరూమ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికలకు 'అమ్రిత సాయి' విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి కంచికచర్ల : .కంచికచర్ల మండలం పరిటాల పరిధిలో గల అమ్రిత సాయి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు చెన్నైకు చెందిన యమహా మోటార్ ఎలక్ట్రానిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలు సాధించారని కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి. చిరంజీవి తెలిపారు. కంపెనీ హెచ్ ఆర్ ప్రతినిధులు కళాశాల బీ.టెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు శనివారం రాత పరీక్ష , గ్రూప్ డిస్కషన్స్, టెక్నికల్ మరియు హెచ్ ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 11 మందిని (ఈసీఈ -10, ఇ ఇ ఇ -1) కంపెనీ తరుపున ఆపరేటర్ ట్రైనీస్ ఎంపిక చేసి 2 .64 లక్షల వార్షిక వేతనం నిర్ణయించి వారికి నియామక ఉత్తర్వులు అందచేసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ కె.రామ్మోహన రావు,ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శశిధర్, విభాగాధిపతులు అభినందించారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినిలు

పోటీలు ప్రారంభిస్తున్న ఎసిపి నాగేశ్వరరెడ్డి

పోలీసు క్రికెట్ టోర్నమెంటు ప్రారంభం

ప్రజాశక్తి-నందిగామ : నందిగామ పట్టణంలోని జడ్పీహెచ్‌ఎస్ గ్రౌండ్లో టిజోలా ఫుడ్ డెలివరీ ఆధ్వర్యంలో నందిగామ సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పోలీస్ అధికారుల క్రికెట్ టోర్నమెంట్‌ను ఏసిపి నాగేశ్వరరెడ్డి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో శనివారం ప్రారంభించారు. మొదటి మ్యాచ్ నందిగామ ఛాంపియన్స్ జగ్గయ్యపేట వారియర్స్ మధ్య మ్యాచ్ మొదలైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ను నందిగామ ఛాంపియన్స్ కెప్టెన్ సీఐ సతీష్ ఎంచుకున్నారు.ఈ సందర్భంగా ఏసీపీ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ క్రీడలతో శరీరానికి వ్యాయామంతో సహా మానసిక ఉల్లాసం కూడా లభిస్తుందని తెలిపారు. అద్భుతమైన బ్యాటింగ్ తో ప్రేక్షకులను సిఐ కె. సతీష్, ఎస్సైలు పండుదొర, హరి ప్రసాద్ అలరించారు.

స్ట్రామ్ వాటర్ డ్రైనేజి స్కీమ్ కథ కంచికేనా...

- వీఎంసి బడ్జెట్లో రూ.289 కోట్లు చూపకపోవడంలో ఆంతర్యం ఏమిటో ?
- ఈ నిధులను వేరే పనులకు మళ్లించిన ప్రభుత్వం
- రూ.461 కోట్లతో 40 శాతం పనులే పూర్తి
- మిగిలిన పనులు ప్రశ్నార్థకమే !

విజయవాడ నగరంలో స్ట్రామ్ వాటర్ డ్రైన్ల నిర్మాణ (వర్షపునీటి డ్రైన్లు) పథకం కథ కంచికే అన్నట్లుగా తయారయింది. కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరై, ఎంతో ప్రధాన్యత కల్గిన ఈ స్కీమ్‌ను వినియోగించుకోవడంలో స్థానిక వైసిపి పాలకవర్గం చేష్టలుడికి చూస్తుంది. దాని రాజకీయ స్వలాభం కోసం రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఆగిపోయిన వందల కోట్ల నిధులను రాబట్టి, పథకాన్నీ పూర్తి చేసి, నగర ప్రజల కష్ట-నష్టాలను తొలగించాలనే ధ్యాస, ఆలోచన ఏ కోశానా లేదన్నట్లుగా అధికారపక్షం వ్యవహరిస్తుందని చెప్పక తప్పదు.



చినుకు పడితే చిత్తడిగా ఉండే విజయవాడ నగరానికి స్ట్రామ్ వాటర్ డ్రైనేజి స్కీమ్‌ను ఎంతో అవసరం. కానీ ఈ స్కీమ్‌కు మంజూరు అయిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం వేరే పథఖాలకు మళ్లించడంతో ప్రస్తుతం ఈ స్కీమ్ ప్రశ్నార్ధకంగా తయారయింది. తమ నగరానికి మంజూరు అయిన స్కీమ్‌కు సంబంధించిన నిధులు ఇవ్వమని అడిగే సహాసం, ధైర్యం స్థానిక అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, మేయర్, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు చేసే పరిస్థితి లేకుండా పోయింది. ఫలితంగా గురువారం ప్రవేశపెట్టిన వీఎంసి బడ్జెట్ (2023-24)లో స్ట్రామ్ వాటర్ డ్రైన్స్‌కు సంబందించిన రూ. 289 కోట్ల నిధులను క్యాపిటల్ పద్దు కింద పొందుపరచకపోవడం గమనార్హం. వాస్తవంగా వీఎంసికి విడుదల చేయాల్సిన ఈ నిధులను గత ఏడాదికి పైగా తొక్కిపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం తన వేరే అవసరాలకు వినియోగించుకుంది. అయితే ఆ నిధులు ఎంత మేరకు వస్తాయో చెప్పలేకపోయినా... ధైర్యం చేసి, స్ట్రామ్ వాటర్‌కు సంబంధించిన రూ. 289 కోట్ల నిధులను క్యాపిటల్ గ్రాంట్స్‌లో కనీసంగా కూడా చూపించలేని పరిస్థితుకి వైసిపి నెట్టబడిందని సిపిఎం, టిడిపి తీవ్ర స్థాయిలో కౌన్సిల్‌లో మండిపడ్డాయి.

స్ట్రామ్ వాటర్ డ్రైనేజి స్కీమ్ నేపథ్యం..

రూ. 461 కోట్ల అంచనా విలువ కల్గిన ఈస్కీమ్‌ను 2016లోనే కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసినా కానీ...2017లో ఆనాటి టిడిపి పాలనలో విజయవాడ నగరంలో స్ట్రామ్ వాటర్ డ్రైనేజి నిర్మాణ పనులు చేపట్టిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం రూ.460 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ. 1.04 కోట్లు మొత్తం వెరసి రూ. 461.04 కోట్లు. నేటికీ ఏడు సంవత్సరాలు గడిచినా కేవలం రూ. 172 కోట్ల విలువ చేసే పనులు (40 శాతం) మాత్రమే పూర్తి అయ్యాయి. వైసిపి ప్రభుత్వం వచ్చి నాలుగేళ్ల అయినా, వీఎంసిలో ఆపార్టీ అధికారంలోకి విచ్చేసి రెండేళ్ల అయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయింది. ఆనాటి టిడిపి కానీ, నేటి వైసిపి కానీ ఈస్కీమ్‌ను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలనే చిత్తశుద్ధి కొరవడిన కారణంగా ఏళ్లు గడుస్తున్నా...నగర వాసులు తీవ్ర ఇబ్బందులు పడతున్నా ప్రభుత్వాలకు చీమకుట్టినట్లుగా కూడా లేదని చెప్పక తప్పదు. ఈ స్కీమ్‌ను చేపట్టిన ఎల్‌అండ్ టి కంపెనీకి గత రెండు సంవత్సరాల క్రితం నాడు చేసిన వర్క్సుకు సంబంధించి రూ. 45 కోట్ల పెండింగ్ బిల్లులు రాకపోవడంతో...చేసేది లేక ఆ కంపెనీ మధ్యలోనే వదిలేసి, ఇక్కడ నుంచి వెళ్లిపోయింది. ఏడాదికి పైగా పూర్తిగా స్కీమ్ నిలిచిపోయింది. వర్షాకాలంలో నగర వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈస్కీమ్‌ను తాము చేపట్టి పూర్తి చేసే విధంగా అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి గత కమిషనర్‌గా పని చేసిన ప్రసన్న వెంకటేష్ ఏడాది క్రితమే ప్రభుత్వానికి లేఖ రాశారు. కానీ ఈ లేఖకు సంబంధించి అటు రాష్ట్ర ప్రభుత్వం వద్ద కానీ, ఇటు వీఎంసి వద్ద ఒక స్పష్టత లేదని వీఎంసి అధికారులు వివరిస్తున్నారు. నగరంలో 142 కిలోమీటర్లకు మేజర్ డ్రైన్లు, 301 కిలోమీటర్ల మైనర్ డ్రైన్ల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉన్నా 40 శాతంలోపు మాత్రమే పూర్తయ్యాయి. పనులు జరిగిన చోట్ల కూడా 290 చోట్ల గ్యాప్‌లను పూర్తి చేయాల్సి ఉంది. ఈ ప్రాజెక్టు పూర్తికి నగరాన్ని ఆరు బేసిన్లుగా 2017లో ప్రారంభించినా నేటికీ అతీగతీ లేకుండా పోయింది. ప్రభుత్వం నుండి స్ట్రామ్ వాటర్ డ్రైన్ల నిధులను రాబట్టి డ్రైన్లను పూర్తి చేయాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు కౌన్సిల్ బడ్జెట్ సమావేశంలో సవరణ తీర్మానం ప్రవేశపెట్టినా ఫలితం లేకుండా పోయింది.

విహెచ్.రాజు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.